తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

వరంగల్ - ఆదిలాబాద్

హన్మకొండ | జనగాం | ములుగు నిర్మల్ | మంచిర్యాల
ప్రొ॥ జయశంకర్ భూపాలపల్లి కొమురం భీం ఆసిఫాబాద్
మహబూబాబాద్

బుధవారం
12 ఆగస్టు 2026

పేజీలు - 18




## గుడిసెలు లేని నియోజకవర్గంగా

# తీర్చిదిద్దడమే నా లక్ష్యం

- స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- రెండో విడత ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో రాష్ట్రం లోనే మొదటి స్థానంలో నిలవాలి
- ఆగస్టు 15 నుండి డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ

**స్టేషన్ ఘన్‌పూర్, ఆగస్టు 11 ( జనం సాక్షి ) :** పేదవారి స్వంత ఇంటి కలను సాకరం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని, రెండు విడతల్లో 35 వేల కోట్ల తో 7లక్షల ఇందిరమ్మఇండ్లు మంజూరు చేయడం జరిగిందని, గుడిసెలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని మాజీ ఉప ముఖ్య మంత్రి, స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. రఘునాథపల్లి మండలం నీడిగొండ లోని సత్యసాయి కన్వెన్షన్ హాల్ లోనిర్వహించిన స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో మాజీ ఉప ముఖ్య మంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మిగతా 15లో..

## రాజీవ్ యువ వికాసం

# అందని ద్రాక్షేనా?

- ఏడాది దాటిన ఎదురుచూపులే..
- నిరాశలో వెంకటాపూర్ నిరుద్యోగులు

**వెంకటాపూర్(రామప్ప ), ఆగస్టు 11(జనం సాక్షి):** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం రాయితీ రుణాల మంజూరీలో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోంది. ఈ పథకం ద్వారా లబ్ధి పొందేందుకు దరఖాస్తులు చేసుకున్న వెంకటాపూర్ మండలంలోని నిరుద్యోగ యువకులు గత ఏడాదిన్నరగా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం రుణాల మంజూరీలో గత కొంతకాలంగా ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో ఈ పథకం అమలు అవుతుందా..? లేదా..? అనే కోణం లో మండలం లోని యువకులు ఆందోళనకు గురవుతున్నారు.

తెలంగాణలో 18 నుంచి 45 ఏళ్ల వయసు ఉన్న నిరుద్యోగులకు రాయితీ రుణాలు అందించనున్నట్లు గత ఏడాది జనవరిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. పథకం అమలు, లబ్ధిదారుల ఎంపిక తీరుపై విధివిధానాలను సైతం జారీ చేసింది.




ఈ పథకం కింద రుణాలు పొంది స్వయం సమృద్ధి సాధించాలనే ఉద్దేశంతో ములుగు జిల్లా వ్యాప్తంగా యువకులు అధిక సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. అదేవిధంగా వెంకటాపూర్ మండలం నుంచి సైతం వందలాది మంది యువత దరఖాస్తులను సమంత శాఖ అధికారులకు సమర్పించారు. అర్హులకు బ్యాంకుల సహకారంతో రుణాలు ఇచ్చేందుకు అధికారులు సైతం దరఖాస్తులను కార్పొరేషన్ల వారీగా విభజించారు. అంతేకాకుండా ఈ ఏడాది జనవరిలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రాయితీ రుణాలు అందించేందుకు ఎస్సీ నిరుద్యోగుల నుంచి సైతం దరఖాస్తులను స్వీకరించారు. మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సదురు అభ్యర్థులకు ముఖాముఖీ ఇంటర్వ్యూలను కూడా నిర్వహించినప్పటికి నేటికి లబ్ధిదారుల ఎంపిక జరుగలేదు. వాటిపై ఇప్పటివరకు మిగతా 15లో..

# చేనులోనే కూరగాయల షెడ్డు..

- అటు సాగు చేస్తూ.. ఇటు కూరగాయలు విక్రయిస్తూ..
- ఆదర్శంగా నిలుస్తున్న రైతు దంపతులు..

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** సాంప్రదాయ, వాణిజ్య పంట సాగులో నష్ట పోతున్న రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెడితే మంచి ఫలితాలు ఉంటాయని నిరూపిస్తున్నారు. ఈ యువ రైతు దంపతులు. కొద్ది పాటి భూమిలోనే కూరగాయలు సాగు చేస్తూ లాభాలు తెచ్చుకుంటున్న ఈ యువ రైతు దంపతులు ఇరుగుపొరుగు వారికి ఆదర్శంగా నిలుస్తున్నారు. సీజన్ వారీగా కూరగాయలు సాగు చేస్తూ, ఆ చేను పక్కనే షెడ్డు వేసి కూరగాయలను నేరుగా అమ్ముతూ ఎక్కువగా లాభాలు పొందుతున్నారు జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రం శివారు భాస్కరగడ్డకు చెందిన యువ రైతు దంపతులు భాస్కర సంపత్, రజిత దంపతులు. కూరగాయల సాగుతో మంచి లాభాలు ఆర్జిస్తున్నారు. తమకున్న కొద్దిపాటి పొలంలోనే తక్కువ పెట్టుబడి, అధిక దిగుబడి వచ్చే కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తూ లాభాలు పొందుతున్నారు. అంతే కాదు ఈ రైతు కుటుంబం మొత్తం ఎక్కువగా ఈ కూరగాయల సాగుపైనే ఆధారపడి జీవిస్తున్నారు.

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రం శివారు భాస్కరగడ్డకు చెందిన భాస్కర సంపత్, రజిత దంపతులకు రెండు ఎకరాల భూమి ఉండగా అందులో పత్తి పంట వేసి సాగు చేస్తున్నారు. మరో ఎకరం భూమిని కౌలుకు తీసుకొని కూరగాయల సాగు చేస్తున్నారు. అందులో రకరకాల కూరగాయలు, ఆకుకూరల పంటలను సాగుచేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. ఎకరం భూమిలో బీరకాయ, బెండకాయ, సొరకాయ, గోంగూర, బబ్బరికాయ చేను తో పాటు వివిధ రకాల కూరగాయల పంటలను సాగు చేస్తున్నారు. పండించిన కూరగాయలను కొంత మార్కెట్ కు తరలిస్తూ, మరికొంత చేను వద్దనే విక్రయాలు చేపట్టారు. చేను పక్కకు ఒక షెడ్డు వేసుకొని దంపతులిద్దరూ అటు పంట చేను సాగు పనులు చూసుకుంటూ, మరోపక్క కూరగాయలను విక్రయిస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. గత నాలుగు ఐదు ఏళ్ళుగా కూరగాయల పంటను సాగు చేస్తూ ఈ రైతు దంపతులు ఆదర్శంగా నిలుస్తున్నారు. రోజుకు 500 రూపాయల నుండి వెయ్యి రూపాయల వరకు కూరగాయలను






విక్రయిస్తున్నారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కూడా పంట చేను వద్ద ఈ రైతు దంపతులు విక్రయిస్తున్న తాజా కూరగాయలను కొనుగోలు చేస్తున్నారు. కూరగాయల సాగుతో అనేక అనేక లాభాలు ఉన్నప్పటికీ ఆయా గ్రామాల్లో కూరగాయల పంట సాగు తక్కువగా ఉంది. కానీ ఈ రైతు దంపతులు కూరగాయల సాగుపై ఆధారపడి జీవిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రభుత్వాలు, వ్యవసాయ శాఖ అధికారులు రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించాల్సిన అవసరం ఉందని, సంపత్-రజిత దంపతుల మిగతా 15లో..

## వరుస దొంగతనాలకు పాల్పడిన

# నిందితుడు అరెస్ట్

**కడెం: ఆగస్టు 11(జనం సాక్షి)** వరుస దొంగతనాలకు పాల్పడిన నిందితుడిని కడెం పోలీసుల బృందం, ఎస్సై సాయి కిరణ్ చాకచక్యంగా పట్టుకొని మంగళవారం రోజున అరెస్టు చేశారు. కడెం పోలీసులు వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని అరెస్ట్ చేసి 5 దొంగతనం కేసులను ఛేదించారు. కడెం పోలీస్ స్టేషన్ పరిధిలో గత సంవత్సరం కాలంగా ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఇంట్లో ఎవరూ లేని ఇళ్లను ముందుగా రెక్కీ నిర్వహించి, అనంతరం రాత్రి సమయాల్లో ఆ ఇళ్లలోకి ప్రవేశించి విలువైన వస్తువులను దొంగిలిస్తున్నట్లు దర్యాప్తులో గుర్తించారు. సాంకేతిక ఆధారాలు, క్షేత్రస్థాయి సమాచారాన్ని సమన్వయం చేసుకుంటూ పోలీసులు చేపట్టిన దర్యాప్తులో కడెం మండలం సారంగాపూర్ గ్రామానికి చెందిన పాడేటి శ్రీకాంత్, దొంగతనాలకు పాల్పడుతున్నట్లు గుర్తించిన ఎస్సై సాయికిరణ్ నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా, కడెం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన 5 వరుస దొంగతనం కేసుల్లో అతని ప్రమేయం ఉన్నట్లు నిర్ధారణ అవ్వడంతో నిందితుడిని అరెస్ట్ చేసి, తదుపరి చట్టపరమైన చర్యల్లో భాగంగా




రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కడెం ఎస్ఐ సాయి కిరణ్ మాట్లాడుతూ...ఆస్తి నేరాల నియంత్రణకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, ప్రజల భద్రతకు విఘాతం కలిగించే విధంగా దొంగతనాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు తమ ఇళ్లను కొంతకాలం పాటు ఖాళీగా ఉంచే సందర్భంలో స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని, పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా కదలికలు కనిపించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా సాంకేతిక ఆధారాలు క్షేత్రస్థాయి సమాచారాన్ని గుర్తించి ఎంతో సమన్వయంతో పనిచేసిన పోలీస్ బృందాన్ని ఎస్సై సాయికిరణ్ ను ఎస్పీ జ్ఞనకి షర్మిల అభినందించారు.

# ఆగస్టు 31 వరకు కొత్త పింఛన్ల దరఖాస్తుల స్వీకరణ

## గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక ఏర్పాట్లు: కలెక్టర్ రాజర్షి షా వెల్లడి



**ఉట్నూర్ ఆగస్టు11 (జనంసాక్షి):** ప్రభుత్వ ఆదేశాల మేరకు కొత్త పింఛన్ల కోసం నేటి నుంచి ఆగస్టు 31 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు.మంగళవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో చేయూత పథకం కింద నూతన దరఖాస్తుల స్వీకరణ, ఆన్లైన్ నవీకరణ ప్రక్రియను ఐటిడిఏ పీఓ మంద మకరందుతో కలిసి ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు,ఆదేశాలు జారీ చేశారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ,గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శులు,పట్టణ ప్రాంతాల్లో వార్డు ఆఫీసర్ల వద్ద దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంచామని స్పష్టం చేశారు.వితంతు,ఒంటరి మహిళలు,దివ్యాంగులు, గీత కార్మికులు,చేనేత కార్మికులు,ఫైలేరియా బాధితులు మాత్రమే ఈ అవకాశాన్నివినియోగించుకోవాలని సూచించారు. అర్హులైనవారు దరఖాస్తు ఫారంతో పాటు రేషన్ కార్డు,ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా,ఫొటో, బ్యాంక్ ఖాతాకు లింక్ అయిన మొబైల్ నంబర్ జతచేయాల్సి ఉంటుందన్నారు. వితంతు పింఛన్ల కోసం గ్రామ పంచాయతీ లేదా మున్సిపాలిటీ జారీ చేసిన మరణ ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా సమర్పించాలని,చేనేత, గీత కార్మికుల దరఖాస్తులను ఎక్సైజ్, హ్యాండ్లూమ్ శాఖల సమన్వయంతో పరిశీలిస్తామన్నారు. ఆన్లైన్ ప్రక్రియ పూర్తి అయిన అనంతరం క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి అర్హులకు పింఛన్ మంజూరు ప్రొసీడింగ్స్ అందజేస్తామని వివరించారు.దరఖాస్తు చేసుకోవడానికి సుమారు మూడు వారాల సమయం ఉన్నందున ప్రజలెవరూ కంగారు పడాల్సిన అవసరం లేదని కోరారు. గిరిజన ప్రాంతాల్లో పెసా మొబిలైజర్లు, కోఆర్డినేటర్ల ద్వారా ఆదివాసీలు, ఇతరులకు దరఖాస్తు ప్రక్రియలో పూర్తి సహాయ సహకారాలుఅందిస్తామని తెలిపారు.ఈ పరిశీలన కార్యక్రమంలో ఎంపీడీవో మహమ్మద్ రాయిస్ ఉల్లా,ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ ఉద్యోగార్థులకు ఉచిత కోచింగ్ ఏర్పాటు చేయాలి




**రామకృష్ణాపూర్, ఆగస్ట్ 11(జనంసాక్షి):** పోలీస్ శాఖలో ఇటీవల ఉద్యోగాల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో పట్టణంలోని నిరుద్యోగ యువతకు ఉచిత పోలీస్ కానిస్టేబుల్ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రజా జాగృతి సమితి అధ్యక్షుడు రాజలింగు మోతె కోరారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్పర్సన్కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజలింగు మోతె మాట్లాడుతూ పట్టణ, పరిసర ప్రాంతాలకు చెందిన పేద, మధ్యతరగతి కుటుంబాల యువత పోలీస్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్నారని తెలిపారు. అయితే ప్రైవేట్ కోచింగ్ సెంటర్లలో అధిక ఫీజులు వసూలు చేస్తుండటంతో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల అభ్యర్థులు కోచింగ్ తీసుకోలేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పోలీస్ ఉద్యోగాల నోటిఫికేషన్ వెలువడిన ప్రస్తుత తరుణంలో మున్సిపాలిటీ సామాజిక బాధ్యతగా ముందుకొచ్చి స్థానిక నిరుద్యోగ యువత కోసం ఉచిత కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. ఇందులో రాత పరీక్షకు సంబంధించిన శిక్షణతో పాటు ఫిజికల్ ట్రైనింగ్, స్టడీ మెటీరియల్, మాక్ టెస్టులు, మోడల్ పరీక్షలు, నిపుణులచే మార్గదర్శకత్వం వంటి సౌకర్యాలను ఉచితంగా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక యువతకు పోటీ పరీక్షలపై అవగాహన కల్పించి, వారికి సరైన శిక్షణ అందిస్తే పోలీస్ ఉద్యోగాల్లో మరిన్ని అవకాశాలు సాధించేందుకు వీలుంటుందని తెలిపారు. నోటిఫికేషన్ గడువు, పరీక్షల సమయం దృష్టిలో ఉంచుకుని వెంటనే ఉచిత కోచింగ్ సెంటర్ ప్రారంభించేందుకు మున్సిపాలిటీ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వేల్పుల వెంకటస్వామి, రామిళ్ల మల్లేష్, ఎట్టం లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

# వారాంతపు సంత తరలింపుకు మార్గం సుగమం

- యుద్ధప్రాతిపదికన చదును పనులు షురూ.
- పనులను పర్యవేక్షించిన మున్సిపల్ చైర్మన్ కొమురయ్య.




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ప్రతి గురువారం నిర్వహిస్తున్న వారాంతపు సంత వల్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఇరుకు ప్రదేశంలో వ్యాపారులు, ప్రజలు గుమిగూడడంతో ట్రాఫిక్ రద్దీ పెరిగి ప్రమాదాలకు ఆస్కారం కలుగుతోంది. ఈ సమస్యలను పరిష్కరించేందుకు సంతను మరో ప్రాంతానికి తరలించాలని నిర్ణయించారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, సింగరేణి ఏరియా జీఎం ఏనుగు రాజేశ్వర్ రెడ్డిలు ఇటీవల ఎర్ర చెరువు సమీపంలోని విశాలమైన స్థలాన్ని పరిశీలించారు. అక్కడ సంత ఏర్పాటు చేస్తే ప్రజలకు, వ్యాపారులకు సౌకర్యంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు వెంటనే చర్యలు ప్రారంభమయ్యాయి. ఎర్ర చెరువు సమీపంలోని స్థలంలో ఉన్న చెట్లు, పొదలను జేసీబీలతో తొలగించి యుద్ధప్రాతిపదికన చదును పనులు చేపట్టారు. గురువారం మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య చదును పనులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే చదును పనులు పూర్తి చేసి వారాంతపు సంతను కొత్త ప్రాంతానికి తరలిస్తామని తెలిపారు. కొత్త సంత ప్రాంతంలో వ్యాపారులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగునీరు, విద్యుత్, పార్కింగ్, పారిశుద్ధ్యం వంటి ప్రాథమిక వసతులు కల్పిస్తామని చెప్పారు. రాకపోకలకు ప్రత్యేక దారులు ఏర్పాటు చేసి సంతను క్రమబద్ధంగా నిర్వహిస్తామని సూచించారు. సంత తరలింపుతో పట్టణంలో ట్రాఫిక్ సమస్య తగ్గడంతో పాటు రైతులు, చిరు వ్యాపారులు తమ ఉత్పత్తులను మరింత సౌకర్యంగా విక్రయించుకునే అవకాశం ఉంటుందని చైర్మన్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు చల్లా రేణుక, కాంగ్రెస్ పార్టీ నాయకులు దుర్గం భిక్షపతి, కంచర్ల బాలయ్య, దుర్గం అనిల్, ఆకుదారి రాజేష్, మహేశ్ తో పాటు మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# టవర్ నిర్మాణం పూర్తయినా ప్రారంభించడం మరిచారు

## అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం



**కెరమేరి, ఆగస్టు11 ( జనంసాక్షి)** కెరమేరి మండలం ముఖదంగూడ గ్రామపంచాయతీలో బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్ నిర్మాణం పూర్తయి నెలలు గడుస్తున్నప్పటికీ ఇంతవరకు ప్రారంభించకపోవడంతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.గ్రామంలో నెట్వర్క్, సిగ్నల్ సమస్య తీవ్రంగా ఉండటంతో ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు టవర్ నిర్మాణాన్ని చేపట్టారు. నిర్మాణం కూడా పూర్తయింది. టవర్ పక్కన సోలార్ ప్యానెల్స్ కూడా ఏర్పాటు చేశారు. కానీ విద్యుత్ కనెక్షన్, సాంకేతిక పనులు పూర్తి చేయకపోవడంతో టవర్ ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో విద్యార్థులు ఆన్లైన్ క్లాసులు, రైతులు ఆన్లైన్ లావాదేవీలు, అత్యవసర సమయాల్లో ఫోన్ కాల్స్ చేసుకోవడానికి కూడా గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. “కోట్లు ఖర్చు పెట్టి టవర్ కట్టారు. కానీ ప్రారంభం చేయకపోతే ఉపయోగం ఏముంది? అధికారులు వెంటనే స్పందించి సిగ్నల్ సేవలను ప్రారంభించాలి” అని గ్రామస్తులు కోరుతున్నారు. కావున జిల్లా కలెక్టర్, బిఎస్ఎన్ఎల్ ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకుని ముఖదంగూడ గ్రామంలో బిఎస్ఎన్ఎల్ టవర్ సేవలను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



### సాల్వే.హరేందర్ ముకదంగూడ మాజీ సర్పంచ్

గ్రామంలో సిగ్నల్ సమస్యతో ఇబ్బంది పడుతున్నాం. అధికారులు బిఎస్ఎన్ఎల్ టవర్ నిర్మాణాన్ని పూర్తిచేసి నెలలు గడుస్తున్నాయి. కానీ నేటికీ ప్రారంభించకపోవడంతో ఫోన్ కాల్స్ చేసుకున్నందుకు ఇబ్బంది పడాల్సి పడాల్సి వస్తోంది. అధికారులు స్పందించి టవర్ని ప్రారంభించాలని కోరుతున్నాం.

# కెరమెరిలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం



**కెరమెరి, ఆగస్టు11(జనంసాక్షి)** హర్ ఘర్ తిరంగా – ప్రతి ఇంటి పైన జాతీయ జెండా ఘనంగా ఎగరాలి. అనే జాతీయ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కేరమేరి మండలంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆగస్టు 10 నుండి 15 వరకు దేశమంతా ఒకే పండుగగా జరుపుకుంటున్న ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటి పైన త్రివర్ణ పతాకాన్ని ఎగరవేయాలని, జాతీయ జెండాతో సెల్ఫీ తీసి హర్ ఘర్ తిరంగా వెబ్సైట్లో అప్లోడ్ చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి మండల అధ్యక్షులు సేడ్మాకి తుకారాం అధ్యక్షత వహించారు. కార్యక్రమ కన్వీనర్ రంగు శ్రీకాంత్, కో–కన్వీనర్ రాథోడ్ ఆత్మరామ్ ఆధ్వర్యంలో జాతీయ పథకాలను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా దీజ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు, సీనియర్ నాయకులు వేణుగోపాల్, బీజేవైఎం మండల అధ్యక్షులు అలుగొట్టు నవీన్ కుమార్, వినోద్, రాజు, రాము తదితర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దేశభక్తిని చాటుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంటి పైన జాతీయ జెండాను ఎగరవేసి ఈ ఉత్సవాన్ని విజయవంతం చేయాలని నాయకులు కోరారు.

# విద్యార్థి దశ నుండే వ్యవసాయంపై అవగాహన అవసరం



**సారంగపూర్,ఆగస్టు11(జనం సాక్షి)** మండల కేంద్రంలో బీరవెల్లి గ్రామంలో ఉన్న భారతి ప్రైవేట్ స్కూల్ లో ప్రధానోపాధ్యాయులు నిమ్మల నరసయ్య విద్యార్థులకు ఫీల్డ్ ట్రిప్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థి దశ నుంచి విద్యార్థులకు వ్యవసాయంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు సేంద్రియ వ్యవసాయం పట్ల అవగాహన కల్పించి ప్రత్యక్షంగా వ్యవసాయ భూమిలో వ్యవసాయ పనులను చేయించారు. వ్యవసాయం యొక్క ప్రాముఖ్యత సేంద్రీయ ఎరువుల వినియోగం పంటల పెంపకం విధానాల గురించి వివరాత్మకంగా ఉపాధ్యాయులు తెలియజేశారు. ఇలాంటి ఫీల్డ్ ట్రిప్స్ లో పిల్లలు ప్రకృతి పట్ల ప్రేమను పెంపొందించోకవడమే కాకుండా మంచి అనుభూతిని పొందారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పెండ్ అయిటీ పోశెట్టి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మల్లారంలో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఎన్నిక

### అధ్యక్షునిగా మారిపాక శివ సాయి



**మల్హర్,ఆగస్టు11(జనంసాక్షి)** మందకృష్ణ ఆదేశాల మేరకు మలహార్ రావు మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు కేసారపు నరేష్ మాదిగ ఆధ్వర్యంలో మల్లారం గ్రామంలో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఎన్నిక జరిగింది. ఇందులో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ అధ్యక్షునిగా మారిపాక శివ సాయి, ఉపాధ్యక్షులుగా మంత్రి సాగర్, ప్రధాన కార్యదర్శిగా మంతెన నవీన్, సహాయ కార్యదర్శిగా మంతెన చిన్న రాజయ్య, వీరిని ఎమ్మార్పీఎస్ గ్రామ పెద్దలందరూ కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో మంతన సమ్మయ్య, మంతెన పెద్ద రాజయ్య, మంత్రి భూమయ్య, మంత్రి వెంకటి, తుంగపల్లి లింగయ్య, బూడిద సతీష్, మంత్రి రవి, అరికిల్ల రవీందర్, నక్క బొందయ్య, చిన్న తూండ్ల మాజీ సర్పంచ్ పులిగంటి నరసయ్య తదితరులు పాల్గొనడం జరిగింది.

## కాట్రపల్లి గ్రామపంచాయతీలో టీబీ శిబిరం



**శాయంపేట, ఆగస్టు 11 (జనం సాక్షి)** టీబీ ముక్ భారత అభియాన్ ఫేజ్ 2 లో భాగంగా శాయంపేట మండలం కాట్రాపల్లి గ్రామ పంచాయతిలో ఎక్స్రే స్క్రీనింగ్, టిబి శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. దీనిలో పద్నాలుగు సంవత్సరాల పైబడిన పిల్లల నుండి అధిక అనారోగ్యానికి ప్రమాదం లో ఉన్న వృద్ధుల వరకు శరీర ద్రవ్యరాశి సూచిక 18 కంటే తక్కువ ఉన్నవారికి ,టిబి కాంటాక్ట్ వారికి ఎక్స్రే, తేమడ పరీక్షలు మరియు టిబి పై అవగాహణ కల్పించామని తెలిపారు. ఈ కార్యక్రమం లో జిల్లా టీబీ వైద్యధికారి డా. ప్రదీప్ రెడ్డి , మెడికల్ ఆఫీసర్ డా. సాయ కృష్ణ , డా. విద్య శ్రీ , సి హెచ్ ఓ మాధవరెడ్డి, సిహెచ్ఓ ప్రేమలత, టిబి స్టాఫ్ సీనియర్ ట్రెమెంట్ సూపర్ వైజర్ శ్రీనివాస్, నోడల్ అధికారి చలపతి రావు, సూపర్ వైజర్ సీతారాం నాయక్, లాబ్ టెక్నీషియన్ కృష్ణ ఎన్ఎంలు, రేడియో గ్రాఫర్లు మహేష్, సదానందం , ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## బీజేపీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా బైక్ యాత్ర

- దేశభక్తి, జాతీయ సమైక్యత చాటేలా ఘనంగా బైక్ ర్యాలీ.
- బీజేపీ మండల అధ్యక్షులు రాసమల్ల వెంకటేశ్వర్లు.



**గూడూరు,ఆగస్టు11(జనంసాక్షి):** ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తి, జాతీయ సమైక్యత భావాలను చాటాలని బీజేపీ మండల అధ్యక్షులు రాసమల్ల వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మంగళవారం గూడూరు మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో బైక్లపై జాతీయ జెండాలతో కార్యకర్తలు పలు విధులల్లో తిరుగుతూ హర్ ఘర్ తిరంగా యాత్రను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తి,జాతీయ సమైక్యత భావాలను చాటాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ జాతీయ జెండాకు గౌరవం ఇవ్వాలని సూచించారు.యువత, మహిళలు, ప్రజలు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు.దేశ ఐక్యత, సమగ్రత కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా జాతీయ జెండాను గౌరవించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేరెడ్డి సురేందర్,సమ్మెట సుధాకర్, గుండెబోయిన మల్లేష్ యాదవ్, చెల్పూరి శ్రీశైలం, పడాల నాగరాజు, బీజేవైఎం మండల అధ్యక్షులు చెల్పూరి రాజు, వడ్లకొండ యాకయ్య, కార్యకర్తలు,యువకులు,తదితరులు పాల్గొన్నారు.

## నూతన బస్టాండ్ అటవీ ప్రాంతంలోనే ఏర్పాటు చేయాలి



**కాళేశ్వరం , ఆగస్టు 11 , ( జనం సాక్షి)** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామంలో నూతన బస్టాండ్ నిర్మాణం హనుమాన్ ఆలయం ముందు కల అటవీ ప్రాంతం లోనే చేపట్టాలని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్కి కాళేశ్వరం గ్రామ తొమ్మిదవ వార్డు సభ్యుడు ఇమ్రాన్ మరియు స్థానికులు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాళేశ్వరం గ్రామంలో నూతన బస్టాండ్ నిర్మాణం సర్వే నెంబర్ 129లో జరపాలని కోరారు. ప్రతి పుష్కారానికి ,ఉత్సవాలకు అటవీ ప్రాంతంలోని హనుమాన్ ఆలయం ముందు ఉన్న సర్వే నెంబర్ 129లో తాత్కాలిక బస్టాండ్ ఏర్పాటు చేస్తున్నారు కనుక ఇక్కడే శాశ్వత బస్టాండ్ ఏర్పాటు చేయాలనీ కోరారు. ఇక్కడ గాని బస్టాండ్ ఏర్పాటు చేస్తే కాళేశ్వరం ను అనుకోని ఉన్న కొన్ని గ్రామాలకు మరియు కాళేశ్వరంలోని కొన్ని వార్డులకి కూడా న్యాయం జరుగుతుంది అన్నారు. అలాగే ఊరి విస్తీర్ణం కూడా పెరిగి అభివృద్ధి కనబడుతుంది అని వారు అన్నారు. అటవీ ప్రాంతంలో బస్టాండ్ నిర్మాణం చేయాలనీ కాళేశ్వరం గ్రామంలోని 500 కు పైగా ప్రజలు సంతకాలు పెట్టి తమ మద్దతుని తెలిపారు అని అన్నారు. అలాగే కాళేశ్వరం పాలకవర్గంలోని 12 మందిలో 9 మంది వార్డు సభ్యులు బస్టాండ్ నిర్మాణం అటవీ ప్రాంతం లోనే జరపాలని సంతకాలు కూడా పెట్టినట్టు వారు తెలిపారు. అదే విధంగా సాకి కుంట చెరువుకు పూర్వ వైభవాన్ని తీసుకొని రావాలని హైడ్రా మంచి నిర్ణయం తీసుకొని చెరువులని కాపాడటం మంచి పద్ధతి అని అన్నారు. కాళేశ్వరం గ్రామంలో ఉన్న సాకి కుంట చెరువు కూడా కబ్జా కు గురి కాకుండా చూడాలన్నారు. చెరువు కింది భాగంలో కాళేశ్వరం యువకులు క్రీడలు ఆడేవారని వారికీ ఈరోజు క్రీడా స్థలం లేకుండా పోయిందని ఆ పూర్వ వైభవాన్నీ మళ్ళీ తీసుకొని రావాలని వారు అదనపు కలెక్టర్ను కోరారు. ఈ కార్యక్రమంలో కాళేశ్వరం గ్రామ యువకులు ఆడప సంతోష్, మబ్బు సాయికిరణ్, తోట చంద్ర శేఖర్, పలువురు ఉన్నారు.

## యువత డ్రగ్స్ మానుకో - లక్ష్యాన్ని చేరుకో




**మహబూబాబాద్,ఆగస్టు 11(జనం సాక్షి):** విద్యార్థి దశ ఎంతో విలువైనదని, ఈ దశలో చెడు అలవాట్లకు, ముఖ్యంగా మత్తు పదార్థాలకు (డ్రగ్స్) దూరంగా ఉండి క్రమశిక్షణతో చదువుకుంటేనే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ డి. నాగేశ్వరావు పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల నిర్మూలన - యువత బాధ్యత అనే అంశంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది వై. చెన్న మల్లా రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రస్తుత సమాజంలో కొందరు యువకులు క్షణికానందం కోసం, స్నేహితుల ఒత్తిడి వల్ల డ్రగ్స్, గంజాయి వంటి వ్యసనాల బారిన పడి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాల వాడకం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా, కుటుంబాలు రోడ్డున పడతాయని ఆయన హెచ్చరించారు. మాదకద్రవ్యాల రవాణా, వినియోగం వెనుక ఉన్న కఠినమైన చట్టాల గురించి మరియు డ్రగ్స్ కేసుల్లో ఇరుక్కుంటే జీవితాంతం నేరస్థులుగా మిగిలిపోవడమే కాకుండా, ప్రభుత్వ ఉద్యోగాలకు, విదేశీ ప్రయాణాలకు అర్హత కోల్పోతారని అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ వి. రాజ్ కృష్ణ తెలిపారు. అనంతరం న్యాయవాది వి.ఆనంద్ కుమార్ మాట్లాడుతూ..బాల్య వివాహాలు వంటి దురాచారాలకు పాల్పడి తమ పిల్లల జీవితాలను నాశనం చేయవద్దన్నారు. 18 సంవత్సరాల లోపు పిల్లలను ఎవరైనా లైంగికంగా వేధించినట్లయితే వారు పోక్సో చట్టం కింద కఠినంగా శిక్షించబడతారని హెచ్చరించారు. ఎవరైనా న్యాయపరమైన సలహాలు సూచనలు కోసం టోల్ ఫ్రీ నంబర్ 15100 కు ఫోన్ చేసి న్యాయ సలహాలు పొందవచ్చు అన్నారు . అనంతరం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మన్ నాయక్ మాట్లాడుతూ.. విద్యార్థులు తమ దృష్టిని కేవలం చదువు, క్రీడలు, సృజనాత్మక నైపుణ్యాలపైనే కేంద్రీకరించాలని సూచించారు . ప్రతి ఒక్కరూ ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దాని సాధన కోసం నిరంతరం కృషి చేయాలని కోరారు. సమాజంలో గొప్ప విజేతలుగా నిలిచిన వారిని స్ఫూర్తిగా తీసుకుని తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల, బోధన సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## మానవత్వ దృక్పథంతో వ్యవహరించాలి

- అడవుల పరిరక్షణ అందరి బాధ్యత
- జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య



**మంగపేట ఆగస్టు 11(జనంసాక్షి)** అడవుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అలాగే తరతరాలుగా పోడు సాగుపై ఆధారపడి జీవిస్తున్న పోడు రైతుల జీవనోపాధికి ఇబ్బంది కలగకుండా అధికారులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య కోరారు. మంగళవారం మండలంలోని నిమ్మగూడెం గ్రామపంచాయతీ పరిధిలోగల ముసలమ్మ తోగు, తక్కల్లగూడెం ప్రాంతాల్లో పోడు భూముల సమస్యలపై జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య స్థానిక ఎస్సై టివిఆర్ సూరి, అటవీశాఖ అధికారులతో కలిసి ఆయన పోడు భూముల వివాదం సమస్యలపై పోడు రైతులతో చర్చించారు. పోడు రైతులకు అటవీశాఖ అధికారులకు వివాదంగా ఉన్న సమస్యను పరిష్కరించాలని ఎన్నో సంవత్సరాలుగా పోడు భూములపై ఆధారపడి జీవిస్తున్న రైతులకు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా అధికారులు రైతుల మధ్య సమన్వయంతో సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన కోరారు. అలాగే అడవుల పరిరక్షణ అందరి బాధ్యత అని కొత్తగా అడవిని నరికి పోడు వ్యవసాయం చేయవద్దని పాత పోడు భూములలోనే సాగు చేసుకోవాలని వారికి సూచించారు. అదేవిధంగా అటవీశాఖ అధికారులు పోడు రైతుల భూముల విషయములో మానవత్వ దృక్పథంతో వ్యవహరించాలని రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దని ఆయన అటవీశాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, అటవీశాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



**మావల ఆగస్ట్ 12( జనం సాక్షి):** ఉపాధి అవకాశాల ను యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజర్షి షా సూచించారు. ప్రభుత్వం, ప్రముఖ సంస్థలు కల్పిస్తున్న ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక మావల మండల కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్), జిల్లా యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ సంస్థ 'టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్' నేతృత్వంలో నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామీణ, పట్టణ ప్రాంత అభ్యర్థులకు ప్రసిద్ధ సంస్థల్లో ఉద్యోగాలు సాధించేందుకు ఇటువంటి క్యాంపస్ డ్రైవ్‌లు ఎంతో దోహదపడతాయని అన్నారు. యువతకు లభించే ఉద్యోగావకాశాలను వదులుకోకుండా, లభించిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. విద్యార్థులు ఉద్యోగాల్లో రాణించడానికి అవసరమైన శిక్షణ, మార్గదర్శకాలను జిల్లా యంత్రాంగం నిరంతరం అందిస్తుందని అన్నారు. జిల్లాలో అందుబాటులో ఉన్న రీజనల్ టాస్క్ స్కిల్లింగ్ సెంటర్ ద్వారా ప్రాథమిక కోడింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి పలు సాంకేతిక నైపుణ్యాలలో శిక్షణ పొందాలని కోరారు. శిక్షణ కావాల్సిన విద్యార్థులు జిల్లా ఉపాధి కల్పనాధికారిని లేదా టాస్క్ మేనేజర్‌ను సంప్రదించవచ్చని సూచించారు. సీబీఆర్టీ పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులందరూ హైదరాబాద్‌లో జరిగే టీసీఎస్ ఇంటర్వ్యూలకు తప్పకుండా హాజరుకావాలని, ఇది మంచి కెరీర్ ఆరంభానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఏదైనా ఉద్యోగ అవకాశం వచ్చినప్పుడు మొదట అందులో చేరి అనుభవం సంపాదించాలని, ఆ తర్వాత నైపుణ్యాలు పెంచుకుంటూ ఉన్నత స్థానాలకు లేదా ఇతర రంగాలకు మారవచ్చని హితవు పలికారు. 2024, 2025, 2026 సంవత్సరాల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఈ అవకాశాలు వర్తిస్తాయని తెలిపారు. భవిష్యత్తులోనూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, ఐటీఐ విద్యార్థుల కోసం మరిన్ని ఉద్యోగ మేళాలను నిరంతరం నిర్వహిస్తామని, ఈ సమాచారాన్ని అర్హులైన మిత్రులు, బంధువులకు తెలియజేసి ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పనాధికారి మిల్కా, టాస్క్ మేనేజర్ సాయి, టిసిఎస్ ప్రతినిధులు శ్రవణ్, సాయి మణికంఠ, శీతల్, కళాశాల ప్రిన్సిపాల్ పున్నారావు, అధ్యాపకులు, వివిధ విభాగాల సిబ్బంది, ఉద్యోగార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధి ప్రణాళికకు దరఖాస్తుల ఆహ్వానం




**పర్వతగిరి, ఆగస్టు 11: (జనం సాక్షి)** పర్వతగిరి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల కోసం ప్రజల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సర్పంచ్ చీదురు శంకర్, పంచాయతీ కార్యదర్శి రఘు తెలిపారు. గ్రామంలోని అంతర్గత రోడ్లు, సైడ్ డ్రైనేజీ కాల్వలు, విద్యుత్ స్తంభాలు, వ్యవసాయ భూములకు వెళ్లే రహదారులు తదితర మౌలిక వసతుల అవసరాలపై ప్రజలు తమ అభ్యర్థనలను గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. అభివృద్ధి పనులు అవసరమైన ప్రాంతాలను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో చేర్చనున్నట్లు వారు తెలిపారు. సంబంధిత పనులు అవసరమైన గ్రామ ప్రజలు ఈ నెల 15వ తేదీలోపు తమ దరఖాస్తులను గ్రామ పంచాయతీ కార్యాలయంలో అందజేయాలని కోరారు. ప్రజల అవసరాలను ప్రణాళికలో పొందుపరిచి గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని సర్పంచ్, కార్యదర్శి తెలిపారు.

## చట్టం మారింది.. కుబీర్ ఉపాధి బోర్డు ఎప్పుడు మారుతుంది?

- అమల్లోకి వచ్చిన నూతన చట్టం.
- పాత బోర్డుతోనే కొనసాగుతున్న కార్యాలయం.



**కుబీర్, ఆగస్టు11, (జనంసాక్షి):** కుబీర్ మండల కేంద్రంలోని గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యాలయ బోర్డును నూతన చట్టం ప్రకారం మార్చాలని స్థానికులు కోరుతున్నారు. కేంద్ర ప్రభుత్వం పాత ఎంజిఎన్ఆర్ఈజీఏ స్థానంలో (వీబీ జీ రామ్ జీ) చట్టాన్ని దేశవ్యాప్తంగా అధికారికంగా అమల్లోకి తెచ్చిన సంగతి తెలిసిందే. ఈ నూతన చట్టం ద్వారా గ్రామీణ కూలీలకు పని దినాలను 100 రోజుల నుండి 125 రోజులకు పెంచడం జరిగింది. అయితే ప్రస్తుతం స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో ఇంకా పాత పేరే కొనసాగుతుండటంతో నిరక్షరాస్యులైన కూలీలు నూతన మార్పులను తెలుసుకోలేక గందరగోళానికి గురవుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి కార్యాలయానికి నూతన చట్టం పేరుతో బోర్డును ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. అలాగే 125 రోజుల ఉపాధి కల్పనతో పాటు మారిన ఇతర నిబంధనలపై గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# వృద్ధాప్య పింఛన్లకు అర్హత కల్పించాలి



**నల్లబెల్లి, ఆగస్టు 11 (జనంసాక్షి):** రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన కొత్త పింఛన్ల మంజూరు ప్రక్రియలో వృద్ధాప్యంలో ఉన్న నిరుపేద మహిళలు, పురుషులకు కూడా అవకాశం కల్పించాలని తెలంగాణ దళిత విద్యావంతుల వేదిక జిల్లా కార్యదర్శి, సామాజిక ఉద్యమ నేత బట్టు సాంబయ్య, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు, దళిత రత్న అవార్డు గ్రహీత పరికిరత్నం డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రాత్రికేయ సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కొత్త పింఛన్ల అర్హతల ప్రకారం వితంతువులు, చేనేత కార్మికులు, దయాలసిస్ రోగులు, ఒంటరి మహిళలు, కల్లుగీత కార్మికులు, ఫైలేరియా బాధితులు, దివ్యాంగులు తదితర వర్గాలకు అవకాశం కల్పించినప్పటికీ, వృద్ధాప్యంలో ఉన్న మహిళలు, పురుషులను అర్హుల జాబితాలో చేర్చకపోవడం బాధాకరమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వయోభారం మీద పడిన ఎంతోమంది నిరుపేదలు ఆర్థిక ఇబ్బందులతో జీవనం సాగిస్తున్నారని తెలిపారు. వృద్ధాప్య పింఛన్ ద్వారా వారికి ఎంతో కొంత ఆర్థిక భరోసా లభిస్తుందని, అందువల్ల మానవతా దృక్పథంతో ప్రభుత్వం వెంటనే దరఖాస్తు విధానాన్ని మార్చాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, జనరల్ కేటగిరీలకు చెందిన అర్హులైన నిరుపేదలందరినీ పింఛన్ల జాబితాలో చేర్చి ఆర్థిక భరోసా కల్పించాలని అన్నారు. కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులందరికీ అవకాశం కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారులు తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం అందించే పింఛన్ ద్వారా వయోభారం మీద పడిన మహిళలు, పురుషులు గౌరవంగా జీవించే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముచ్చింపుల ఉపసర్పంచ్ బొట్ల దయాకర్, పాలకుర్తి శారద, కొలగాని రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించాలి

- బాలసముద్రం రెండు పడకల గదుల సముదాయంలో ఎస్‌టీపీ పరిశీలన
- ఇందిరానగర్‌లో అవెన్యూ ప్లాంటేషన్‌లో మొక్కలు నాటిన కమిషనర్



**వరంగల్ ఎంజీఎం, ఆగస్టు 11(జనంసాక్షి):** బాలసముద్రం రెండు పడకల గదుల సముదాయంలో ఏర్పాటు చేసిన సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్‌టీపీ)ను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించి వినియోగంలోకి తీసుకురావాలని బల్దియా కమిషనర్ టి. వెంకన్న ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం బాలసముద్రంలోని రెండు పడకల గదుల సముదాయాన్ని సందర్శించిన కమిషనర్, అక్కడి 300 కేఎల్‌డీ సామర్థ్యం గల ఎస్‌టీపీని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్థానిక అవసరాలకు అనుగుణంగా ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్‌ను పునరుద్ధరించేందుకు అవసరమైన టెండర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి, వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు.అనంతరం 59వ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్ కాలనీలో నిర్వహించిన అవెన్యూ ప్లాంటేషన్ కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని, స్థానిక కాలనీ ప్రతినిధులతో కలిసి మొక్కలు నాటారు. నగరంలో పచ్చదనం పెంపొందించేందుకు అవెన్యూ ప్లాంటేషన్‌ను ప్రోత్సహించాలని కమిషనర్ సూచించారు. ఈ పర్యటనలో సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, ఇన్‌చార్జి హార్టికల్చర్ అధికారి లక్ష్మారెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మహేందర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ స్పందన తదితరులు పాల్గొన్నారు..

## మండల కేంద్రంలోని పేర్కపల్లె గ్రామంలో భూ వివాదం

- 50 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూమిలో పంట ధ్వంసం చేశారని మహిళా రైతు ఆవేదన.
- మూడు ఎకరాల భూమిపైకి దౌర్జన్యానికి దిగిన ఓ వర్గం.



**దస్తూరాబాద్, ఆగష్టు 11 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని పెర్కపల్లి గ్రామంలో మంగళవారం భూ వివాదం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. గత 50 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూమిపైకి ఒక వర్గం వారు వచ్చి దౌర్జన్యానికి దిగారు. పంటను ధ్వంసం చేయడమే కాకుండా, పశువుల మందను పొలంలోకి తోలి తీవ్ర నష్టం చేకూర్చారని బాధితురాలు తెలిపారు. వివరాల ప్రకారం గోపు లచ్చవ్వ అనే మహిళా రైతుకు మూడు ఎకరాల భూమి ఉంది. ఈ భూమిలో ఆమె కుటుంబం గత యాభై ఏళ్లుగా వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. అయితే తాజాగా గ్రామానికి చెందిన ఒక వర్గం వారు ఈ భూమిపైకి వచ్చారు. గతంలో ఇది పార్వతి లచ్చ గౌడ్‌కు చెందిన భూమి అంటూ గొడవకు దిగారు. అంతటితో ఆగకుండా లచ్చవ్వ పొలంలో వేసిన నాట్లను, పంటను పూర్తిగా ధ్వంసం చేశారు. ఆపై కాలనీకి చెందిన బర్ల మందను కావాలనే ఆ పొలంలోకి తోలి మరింత విధ్వంసం సృష్టించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎలాంటి ఘర్షణలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. రెవెన్యూ అధికారులు స్పందించి, సర్వే నిర్వహించి తమకు న్యాయం చేయాలని బాధితులు, గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో సాయి భోజన్



**బెల్లంపల్లి, ఆగష్టు 11, (జనంసాక్షి)** బెల్లంపల్లి పట్టణంలోని వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం సనాతన ధర్మ బాయిజమ్మ సాయి భక్తి ప్రచార ధార్మిక సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో దాతలు గాజ అన్వేష్ జన్మదినం సందర్భంగా కుటుంబ సభ్యులు భార్య గాజ శైలజవాణి, కూతురు రితిక, బొడ్డు మల్లేష్, పూదరి భీమ్రావు, నరహరి సహకారంతో గర్భిణులకు బాలింతలకు, డయాలసిస్ రోగులకు, అన్నార్తులకు సాయి భోజన్ అన్నదానం చేసినట్లు ట్రస్ట్ వ్యవస్థాపకులు కాంపల్లి శంకర్ - రాజేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని, గర్భిణీలు, బాలింతలు, రోగులు, అన్నార్తులు, ఆసుపత్రి సిబ్బంది, సాయి భోజన్ అన్నదాన కార్యక్రమాన్ని వినియోగించుకున్నారు. వారందరూ అన్నదానం చేయడం పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ, బాయిజమ్మ సాయి సేవా ట్రస్ట్ కు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ట్రస్ట్ ద్వారా ఆకలితో ఉన్నవారిని అతిథి సత్కారంతో ఆదరిద్దాం, అన్నదానంతో తృప్తి పరుద్దాం అని ట్రస్ట్ వ్యవస్థాపకులు పిలుపునిచ్చారు. సేవే లక్ష్యం, సేవే మార్గంతో ట్రస్ట్ కొనసాగుతుందని, మానవ సేవే మాధవ సేవ అని త్రవిద్య, శ్రవిద్య, త్రయాక్షర్ సూచించారు. ఈ సేవా కార్యక్రమములో ట్రస్ట్ మేనేజర్ బొద్దున సతీష్, సభ్యులు జేరిపోతుల చంద్రకళ, సేవకులు పోతురాజుల తిరుపతి, గాజ సతీష్, కుంబర్కర్ రాజు, మధుకర్ తదితరులు పాల్గొన్నారు. బాయిజమ్మసాయి సేవా ట్రస్ట్ ద్వారా అన్నదానం, సాయం అందించాలని అనుకునేవారు ట్రస్ట్ మేనేజర్ 8106550532, ఫౌండర్స్ 9959269975, 9949041595 సంప్రదించాలని తెలిపారు.

## అంధకూర్ ప్రభుత్వ పాఠశాలలో యూనిఫామ్ పంపిణీ



**కుంటాల, ఆగస్టు 11(జనం సాక్షి):** స్థానిక ప్రీ ప్రైమరీ అంధకూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచిత యూనిఫామ్ల పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయుల (హెచ్ఎం) ప్రత్యేక సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి అంధకూర్ గ్రామ సర్పంచ్ ప్రవళికా-ప్రశాంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రవళికా ప్రశాంత్ తన చేతుల మీదుగా పాఠశాలలోని చిన్నారి విద్యార్థులకు యూనిఫామ్స్ పంపిణీ చేశారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు మనాజిగారి సిద్ధిరామ్ మాట్లాడుతూ.. ఈ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని రకాల సౌకర్యాలను కల్పించేందుకు తాను కట్టుబడి ఉన్నానన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులు ఈ వసతులను సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలని, ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, సర్పంచ్ మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉచితంగా యూనిఫామ్లు అందుకున్న విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## కమలానగర్ కాలనీ సమస్యలను పరిష్కరించాలి

### మున్సిపల్ వైస్ చైర్మన్, కమిషనర్‌కు కాలనీవాసుల వినతి



**నిర్మల్ టౌన్: ఆగస్టు 11,(జనంసాక్షి )** జిల్లా కేంద్రంలోని కమలానగర్ కాలనీలో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ కాలనీవాసులు మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పల గణేష్ చక్రవర్తి, మున్సిపల్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాలనీలో ప్రధానంగా డ్రైనేజీ వ్యవస్థ, మురుగు కాలువలు, సీసీ రోడ్లు, విద్యుత్ స్తంభాలు, మున్సిపల్ నీటి కనెక్షన్లు తదితర సమస్యలతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వారి దృష్టికి తీసుకెళ్లారు. వర్షాకాలంలో డ్రైనేజీ, మురుగు కాలువల సమస్యల కారణంగా కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రోడ్ల పరిస్థితి కూడా అధ్వానంగా ఉండటంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. అదేవిధంగా అవసరమైన ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడంతో పాటు, మున్సిపల్ నీటి కనెక్షన్లు, ఇతర ప్రాథమిక సౌకర్యాలను మెరుగుపరచాలని కోరారు. కాలనీవాసుల సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత విభాగాల అధికారులతో సమన్వయం చేసుకుని వీలైనంత త్వరగా పరిష్కరించాలని మున్సిపల్ వైస్ చైర్మన్, కమిషనర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో కమలానగర్ కాలనీ అధ్యక్షుడు మధుసూధన్, రమేష్, ప్రకాష్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, సాయికుమార్ , గంగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయకుంటే సీఎం పరకాల పర్యటనను అడ్డుకుంటాం

- నడికుడలో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలి..
- మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలి వద్ద బిజెపి నేతల ధర్నా
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా. పగడాల కాళీ ప్రసాద్ రావు



**నడికుడ ఆగస్టు 11 (జనం సాక్షి) :** నడికూడ మండల కేంద్రంలో పూర్తిస్థాయి పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం భారతీయ జనతా పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో మండల పార్టీ అధ్యక్షులు ఎరుకల దివాకర్ అధ్యక్షతన మహా ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పరకాల నియోజకవర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే డా. పగడాల కాళీ ప్రసాద్ రావు, జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డా. పగడాల కాళీ ప్రసాద్ రావు మాట్లాడుతూ.. 2018లో నడికూడ మండలం ఏర్పడినప్పటి నాటి నుంచి నేటి వరకు మండల కేంద్రంలో పూర్తిస్థాయి పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయకపోవడం ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నడికూడ మండలంపై నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. నడికూడ మండలంలోని కంటాత్మకూర్, కౌకొండ, రామకృష్ణాపూర్, సర్వాపూర్ గ్రామపంచాయతీలు ఇప్పటికీ ఇతర పోలీస్ స్టేషన్ పరిధిలో కొనసాగుతున్నాయని తెలిపారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు చిన్నచిన్న ఫిర్యాదుల కోసం సైతం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అత్యవసర సమయాల్లో పోలీసు సేవలు సకాలంలో అందక మహిళలు, రైతులు, విద్యార్థులు, వ్యాపారులు, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. మండల ప్రజల భద్రత, మహిళల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం నడికూడ మండల కేంద్రంలో వెంటనే పూర్తిస్థాయి పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించకపోతే ప్రజల హక్కుల కోసం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మరింత ఉధృతంగా ప్రజా పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. నడికూడ మండలంలో పూర్తిస్థాయి పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయకుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరకాల పర్యటనను అడ్డుకుంటామని డా. పగడాల కాళీ ప్రసాద్ రావు స్పష్టం చేశారు. ధర్నా కొనసాగుతున్న సమయంలో పరకాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డా. పగడాల కాళీ ప్రసాద్ రావుతో ఫోన్‌లో మాట్లాడి, నడికూడ మండలంలో పూర్తిస్థాయి పోలీస్ స్టేషన్ ఏర్పాటుపై ఉన్నతాధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో బీజేపీ నాయకులు ధర్నా కార్యక్రమాన్ని విరమించారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి ముఖ్య నాయకులుకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థుల అభ్యసన స్థాయి మెరుగుదలకు ఉపాధ్యాయులు కృషి చేయాలి



**కాళేశ్వరం, ఆగస్టు 11 ,( జనం సాక్షి)** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలోని పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి ముద్దమల్ల రాజేందర్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, పేరెంట్స్ టీచర్ సమావేశాల నిర్వహణ, గత విద్యా సంవత్సరం పదవ తరగతి ఫలితాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఉద్దేశించి జిల్లా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 95 నుంచి 136కు పెరగడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఇది పాఠశాలపై తల్లిదండ్రులు, స్థానిక ప్రజల్లో పెరుగుతున్న నమ్మకానికి నిదర్శనమని పేర్కొన్నారు. విద్యార్థుల సంఖ్య పెరగడం ఒక మంచి పరిణామమని, అదే సమయంలో వారికి నాణ్యమైన విద్యను అందించడం ఉపాధ్యాయులపై మరింత బాధ్యతను పెంచుతుందని అన్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు అనేక రకాల వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తోందని ఆయన తెలిపారు. శిక్షణ కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు నేర్చుకున్న ప్రతి అంశాన్ని తరగతి గదిలో సమర్థవంతంగా అమలు చేసి, దాని ప్రయోజనాలను విద్యార్థులకు అందేలా కృషి చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థి అభ్యసన స్థాయిని మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. ప్రతి విద్యార్థి అభ్యసన స్థాయిని ఉపాధ్యాయులు నిరంతరం అంచనా వేస్తూ, అవసరమైన విద్యార్థులకు ప్రత్యేక బోధన అందించాలని సూచించారు. విద్యార్థుల అభ్యసన ఫలితాలే పాఠశాల పనితీరుకు ప్రధాన ప్రమాణమని, అందువల్ల ప్రతి ఉపాధ్యాయుడు బాధ్యతతో పనిచేసి విద్యార్థుల సామర్థ్యాలను వెలికితీయాలని కోరారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దొనికల రాజేందర్ పాఠశాలలో అమలు చేస్తున్న విద్యా కార్యక్రమాలు, విద్యార్థుల ప్రగతి తదితర అంశాలను జిల్లా విద్యాశాఖ అధికారికి వివరించారు.

# భావితరాల విజ్ఞానం కోసం పుస్తకాన్ని మించిన సాధనం లేదు

### జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెన్నం శ్రీకాంత్ రెడ్డి



**మహబూబాబాద్, ఆగస్టు 11(జనం సాక్షి):** మహబూబాబాద్ జిల్లా కేంద్ర గ్రంథాలయానికి, జిల్లా గ్రంథాలయ పాఠకులు పోటీ పరీక్షల సంబంధించిన పుస్తకాలు పాఠకుల సౌకర్యార్థం కోసం ప్రతి చదువరికి పుస్తకం ఉండాలని తలంపుతో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెన్నం శ్రీకాంత్ రెడ్డి తన సొంత ఖర్చులతో 30 వేల రూపాయల కాంపిటీటివ్ ఎగ్జామ్స్ సంబంధించిన గ్రూప్ వన్, గ్రూప్ టు ,ఎస్సై , కానిస్టేబుల్స్ ,బ్యాంకు, జూనియర్ లైన్ మెన్, అట్లాస్ ఇండియన్ పాలిటి, తెలంగాణ చరిత్ర ,భారత చరిత్ర , ఇంకా అనేక పుస్తకాలు, జిల్లా కేంద్ర గ్రంథాలయానికి వితరణ చేశారు. అనంతరం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెన్నం శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ మనకు తెలియని ప్రపంచాన్ని మనకు చూపించి మన నడవడిక ఆలోచనలు సక్రమార్గంలో పయనించడానికి భావితరల విజ్ఞానం కోసం పుస్తకానికి మించిన సాధనం ఏది లేదని , కాబట్టి ప్రతి పాఠకుడు ఈ కాంపిటీటివ్ పుస్తకాలను వినియోగించుకొని పోటీ పరీక్షల్లో విజేతలై తల్లిదండ్రుల ఆశయాలు నెరవేరుస్తూ, సమాజాభివృద్ధికి దోహదపడాలని కోరారు. అనంతరం గ్రంథాలయ పాఠకులు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఔదార్యానికి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకులు ,జి విజేందర్ ,రుద్రారపు వీరేందర్, మరియు నరసింగం శ్రీనివాస్, మందుల రఘు,భూలక్ష్మి యాదమ్మ గ్రంథాలయ పాఠకులు గోపాల్ ,నవీన్,సురేష్ ప్రవల్లిక ,జ్యోతి , శారద తదితరులు పాల్గొన్నారు.

## టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో మేడారంలో ఆషాడ మాస వనభోజనాలు



**వరంగల్ ఈస్ట్, ఆగస్టు 11 (జనం సాక్షి)** వరంగల్ జిల్లా టిఎన్జీవోస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆషాడ మాస వనభోజనాల కార్యక్రమం మేడారంలోని శ్రీ సమ్మక్క సారలమ్మ దేవతల సన్నిధిలో ఘనంగా నిర్వహించడం జరిగింది.ఇట్టి కార్యక్రమంలో వరంగల్ ఉమ్మడి జిల్లాలోని ఉద్యోగులందరూ పెద్ద ఎత్తున పాల్గొని శ్రీ సమ్మక్క సారలమ్మ వనదేవతలను దర్శించుకొని,మొక్కులు సమర్పించి, ఉద్యోగుల అపరిష్కృత సమస్యలు పరిష్కారం అయ్యేలా చూడాలని వేడుకున్నారు.ఈ సందర్భంగా వరంగల్ జిల్లా టీఎన్జీవో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు గాజె వేణుగోపాల్ , పాలకుర్తి సదానందం మాట్లాడుతూ తెలంగాణ ప్రజల జీవన విధానానికి ప్రతీక అయిన ఆషాడ మాస వనభోజనాలు మేడారంలోని పవిత్ర సమ్మక్క సారలమ్మ సన్నిధిలో నిర్వహించడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ సామూహిక భక్తి విశ్వాసాలకు సామాజిక సమిష్టి జీవన తత్వానికి ప్రతిరూపమే ఆషాడ మాస బోనాలని, దక్షిణాయన కాలంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని పంటలు బాగా పండాలని ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగ కుటుంబాలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా గౌరవ అధ్యక్షులు గజ్జల రామ్ కిషన్, హనుమకొండ జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్,భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు బూరుగురవి, ములుగు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పోలురాజు, మేడి చైతన్య మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, వరంగల్ జిల్లా కోశాధికారి అందె కిరణ్, హనుమకొండ జిల్లా గౌరవ అధ్యక్షులు శ్యాం, కేంద్ర సంఘ ఉపాధ్యక్షులు రాము నాయక్, నాగ బ్రహ్మ చారీ,భూపాలపల్లి జిల్లా ఉపాధ్యక్షులు మురళీధర్ రెడ్డి, వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు గద్దల రాజు,రజనీకాంత్, సిటీ అధ్యక్షులు శంకేసి రాజేష్,4వ తరగతి ఉద్యోగుల అధ్యక్ష కార్యదర్శులు సాంబయ్య,భాను హనుమకొండ జిల్లా బాధ్యులు రాజీవ్ రాజ్, వరంగల్ జిల్లా బాధ్యులు పాలకుర్తి మధు, వంగ రవీందర్, శరత్,రఘు గణేష్,చిరంజీవి,శ్యామ్ వినోద్,చంద్రావు, సందీప్, ఆనంద్ రావు, కిషన్,నాగేశ్వరరావు, కుమారస్వామి, నర్సంపేట తాలూకా కార్యదర్శి హర్షవర్ధన్ రెడ్డి,పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు యాకుబ్,సదానందం తదితర ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కాకతీయ జూలాజికల్ పార్క్ అభివృద్ధికి కాంప నిధులు మంజూరు చేయాలి

- ఎన్‌క్లోజర్లు, నైట్ షెల్టర్లకు త్వరగా అనుమతులివ్వాలి
- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- జంతువుల కదలికలపై వీడియో, ఆడియో పర్యవేక్షణ ఏర్పాటు చేయాలి



**వరంగల్ బ్యూరో, ఆగస్టు 11 (జనం సాక్షి)** కాకతీయ జూలాజికల్ పార్కు అభివృద్ధికి కాంపెన్సేటరీ అఫారెస్టేషన్ ఫండ్ మేనేజ్‌మెంట్ అండ్ ప్లానింగ్ అథారిటీ నిధులు మంజూరు చేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కోరారు. ఈ మేరకు మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర జూ అథారిటీ సభ్య కార్యదర్శి డా. వి. క్లెమెంట్ బెన్‌ను కలిసి వినతిపత్రం అందజేసి వివరించారు.హనుమకొండలోని కాకతీయ జూలాజికల్ పార్కులో సింహాల ఎన్‌క్లోజర్, నైట్ షెల్టర్, హైనా, జాకల్, వైల్డ్‌డాగ్ ఎన్‌క్లోజర్లు, నైట్ షెల్టర్లు, సరీసృపాల ఎన్‌క్లోజర్ల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను తెలంగాణ అటవీ శాఖ ఇప్పటికే కేంద్ర జూ అథారిటీకి సమర్పించిందని ఎంపీ తెలిపారు. సాంకేతిక కమిటీ సూచనల మేరకు సవరణలు చేసి డిజైన్లు, డ్రాయింగ్‌లు సమర్పించినందున వాటికి త్వరగా ఆమోదం ఇవ్వాలని కోరారు.సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న జూలాజికల్ పార్కులో జంతువుల సంరక్షణతో పాటు మొక్కల పెంపకం, పచ్చదనం అభివృద్ధి, పార్కు విస్తరణకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని ఎంపీ డా.కడియం కావ్య విజ్ఞప్తి చేశారు. కాంపా నిధులను విడుదల చేసి ఈ పనులకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జంతువుల కదలికలు, ప్రవర్తనను నిరంతరం గమనిస్తూ వాటి సంరక్షణ, భద్రతను పర్యవేక్షించేందుకు వీడియో, ఆడియో రికార్డింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఎంపీ సూచించారు. ఆధునిక పర్యవేక్షణ సదుపాయాలతో జంతువుల సంరక్షణ మరింత సమర్థంగా చేపట్టవచ్చని తెలిపారు.కాకతీయ జూలాజికల్ పార్కును వన్యప్రాణి సంరక్షణ, పర్యావరణ విద్య, ఎకో టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేస్తే వరంగల్‌కు వచ్చే పర్యాటకుల సంఖ్య పెరగడంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు, ఆర్థిక కార్యకలాపాలు మెరుగుపడతాయని ఎంపీ పేర్కొన్నారు.ఎంపీ డా. కడియం కావ్య చేసిన విజ్ఞప్తులపై కేంద్ర జూ అథారిటీ సభ్య కార్యదర్శి డా. వి. క్లెమెంట్ బెన్ సానుకూలంగా స్పందించారు. కాకతీయ జూలాజికల్ పార్కు అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను పరిశీలించి, నిబంధనల మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య వెల్లడించారు.

## ప్రతి ఒక్కరూ రాజ్యాంగ హక్కులు, బాధ్యతలను తెలుసుకోవాలి

### హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ శ్వేత, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**హనుమకొండ, ప్రతినిధి ఆగస్టు 11,( జనం సాక్షి) :** రాజ్యాంగం కల్పించిన హక్కులతో పాటు పౌరులుగా మన బాధ్యతలను కూడా ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత అన్నారు. మంగళవారం హనుమకొండ లోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ వరంగల్ ఫీల్డ్ కార్యాలయం ఆధ్వర్యంలో 'హర్ ఘర్ తిరంగా' పై రెండు రోజుల ఇంటిగ్రేటెడ్ కమ్యూనికేషన్ అండ్ ఔట్రీచ్ ప్రోగ్రాం, ఫోటో ఎక్సిబిషన్ ను పోలీస్ కమిషనర్, జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన అనంతరం వరంగల్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ తరుణ్ కుమార్ బోడా సీబీసీ రూపొందించిన జాతీయ పతాకం యొక్క ప్రస్థానం, స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాల పై ఫోటో ఎగ్జిబిషన్‌లోని అంశాలను వివరించారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ కేంద్ర సమాచార మరియు ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. అలాగే క్విజ్, వకృత్వ, వ్యాసరచన పోటీలలో విద్యార్థులు చాలామంది ఉత్సాహంగా పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని పేర్కొన్నారు. భారత స్వాతంత్ర్య పోరాటం, స్వాతంత్ర్యం కోసం జరిగిన త్యాగాలు, పోరాటాల జ్ఞాపకాలు ఎప్పటికీగుర్తుంచుకోవాలన్నారు. స్వతంత్ర భారతదేశంలో జన్మించడం మన అదృష్టం అని అన్నారు. ఇంత గొప్ప ప్రజాస్వామ్య వ్యవస్థను వారసత్వంగా పొందడం మనకు లభించిన గొప్ప అవకాశమని తెలిపారు. మన రాజ్యాంగాన్ని పొందడం మన అదృష్టం అని పేర్కొన్నారు. ప్రాథమిక హక్కులు, ప్రాథమిక విధులు మనకు ఉన్నాయని అన్నారు. కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి. శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర సమాచార శాఖ ఆద్వర్యం లో నిర్వహించిన 'హర్ ఘర్ తిరంగా' పై పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని అన్నారు. విద్యార్థులలో దేశం పట్ల బాధ్యత పెంపొందించటానికి ఇటువంటి కార్యక్రమాలు అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ రజనీ లత,ప్రోగ్రామ్ ఇన్చార్జి సమత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కొడకండ్లలో పందుల బెడద - ప్రజలు ఆందోళన



కొడకండ్ల గ్రామంలో పందులు విపరీతంగా జనం మధ్యలో సంచరిస్తూ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. వీధులు, నివాస ప్రాంతాల్లో గుంపులుగా తిరుగుతున్న పందుల కారణంగా అపరిశుభ్ర వాతావరణం ఏర్పడి, అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు బయటకు వెళ్లేందుకు భయపడుతున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పందులను పట్టించి, గ్రామంలో పారిశుధ్య చర్యలు చేపట్టి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు తగు చర్యలు తక్షణమే తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ఘనంగా ఎల్లమ్మ బోనాలు



**మరిపెడ చిన్న గూడూరు ఆగస్టు 11 (జనం సాక్షి)** చిన్నగుడురు మండలం విస్సంపల్లి గ్రామంలో ఘనంగా ఎల్లమ్మ బోనాల కార్యక్రమం నిర్వహించారు విస్సంపల్లి గ్రామ పంచాయతీ సర్పంచి మానుపాటి కరుణాకర్ ఆధ్వర్యంలో మంగళ వారం నిర్వహించారు. ఈ ఆషాఢ మాసం లో తెలంగాణ రాష్ట్రంలో ముత్యాలమ్మ ఎల్లమ్మ గ్రామ దేవతలకు ఈ మాసంలో బోనాలు చేల్లడం ఆనవాయితీగా తెలంగాణ ప్రజలు కార్యక్రమాలు నిర్వహించడం ఆచారంగా వస్తుంది ఈ ఆషాడ మాసంలో శాశ్వత అర్చకుల కుటుంబ సభ్యులు వడ్రంగి పోలోజు రాంబాబు ఆధ్వర్యంలో ఎల్లమ్మ బోనాల కార్యక్రమంలో నిర్వహించారు విస్సంపల్లి గ్రామ ప్రజలు విస్సంపల్లి గ్రామ నడిబొడ్డున గుట్ట పై వెలసిన బ్రాహ్మణ ఎల్లమ్మ తల్లి నీ గ్రామ దేవతగా కొలుచు కుంటారు ప్రతి సంవత్సరం అందరూ కలిసి ఘనంగా బోనాలు సమర్పించి పాడి పంటల తో గ్రామాన్ని చల్లగా ఉండాలని కోరుకుంటారు ఈ సందర్భంగా సర్పంచి మానుపాటి కరుణాకర్ మాట్లాడుతూ ఎల్లమ్మ బోనాలు సమర్పించి అనంతరం ముత్యాలమ్మ బోనాలు చెల్లించడం అనవాయితీ గా వస్తుంది అని ఎల్లమ్మ గుట్ట పై వెలసిన బ్రాహ్మణ ఎల్లమ్మ ఒక గుహలో వెలసింది అని అక్కడికి చేరుకొనే మార్గం మొత్తం చెట్లు ముళ్ళ చెట్లతో నిండి ఉండి అక్కడికి చేరుకోవడనికి చాలా ఇబ్బందులు పడుతున్నరనీ ప్రస్తుతం స్వంతంగా కొంత మేరకు చెట్లు తొలగించిన మున్ముందు శాశ్వత పరిష్కారం కోసం ప్రయత్నం చేస్తున్నామని ఈ మార్గం నిర్మాణ కార్యక్రమం దాతలు మరియు గ్రామ ప్రజలు అందరూ కలిసి ఆర్థిక సహాయం చేయాలని అప్పుడే ఇది సాధ్యం మౌతుందనీ అన్నారు ఈ కార్యక్రమంలొ ఉప సర్పంచి ఈరబోయిన క్రిష్ణ , వార్డు మెంబర్ వనపర్తి ఉప్పలయ్య, రమేష్ బొమ్మ అచ్చిలింగం, కొండపర్తి రమేష్ మహిళలు చిన్నారులతో ఆటపాటలతో అంత సంతోషంగా బోనాలు సమర్పించారు.

## ప్రకృతి పరిరక్షణే లక్ష్యంగా.. దేశవ్యాప్త పాదయాత్ర



**రెబ్బెన,ఆగస్టు11(జనం సాక్షి):** పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపుపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన సౌరభ్ దేవాంగన్ దేశవ్యాప్తంగా పాదయాత్ర చేస్తున్నారు. 'మొక్కలు నాటండి.. ప్రాణాలను రక్షించండి.. ప్రకృతిని గౌరవించండి' అనే నినాదంతో 2021 అక్టోబరు 7న రాయ్‌పూర్ నుంచి యాత్రను ప్రారంభించినట్లు తెలిపారు. అన్ని రాష్ట్రాల్లో పర్యటిస్తూ ప్రజలకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలానికి చేరుకున్నారు. తెలంగాణ మీదుగా స్వరాష్ట్రం ఛత్తీస్‌గఢ్‌కు చేరుకుని యాత్రను ముగించనున్నట్లు సౌరభ్ తెలిపారు. రెబ్బెనకు చేరుకున్న ఆయనకు బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు, యువకులు, గ్రామస్థులు స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు.

## డిగ్రీ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 11(జనంసాక్షి ):** ప్రైవేటు అద్దె భవనంలో కొనసాగుతున్న ప్రభుత్వ గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాలను జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలోని తరగతి గదులు, ప్రయోగశాలలు (ల్యాబ్స్), లైబ్రరీ, విద్యార్థుల వసతులను ఆయన నిశితంగా పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న బోధన, మౌలిక సదుపాయాల గురించి కళాశాల అధ్యాపకులు, విద్యార్థులతో నేరుగా మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రైవేటు భవనంలో అరకొర వసతుల వల్ల విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఆరా తీశారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అద్దె భవనంలో విద్యార్థులకు ఎలాంటి తాగునీరు, పారిశుధ్యం లేదా ఇతర మౌలిక సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కళాశాల సొంత భవన నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కోర్టు ప్రాంగణంలో క్రీడా పోటీలు ప్రారంభం



**భైంసా, ఆగస్టు 11: (జనంసాక్షి )** 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని భైంసా అడ్వకేట్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణంలో క్రీడా పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. న్యాయమూర్తి ఆర్.కె. వెంకట రమణ సుహాస్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సి. శంకర్, ఏపీపీ అరుణ, ఏజీపీ నవనీత, సీనియర్ న్యాయవాది కులకర్ణి సంతోష్‌కుమార్, గేమ్స్ అండ్ స్పోర్ట్స్ కార్యదర్శి తాడేవార్ సాయినాథ్‌తో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న పోటీల్లో సీనియర్, జూనియర్ న్యాయవాదులు ఉత్సాహంగా పాల్గొన్నారు. క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసంతో పాటు న్యాయవాదుల మధ్య స్నేహభావాన్ని పెంపొందిస్తాయని నిర్వాహకులు తెలిపారు.

## కాంట్రాక్టు కార్మికుల సిఎంపీఫ్ వివరాలను ఆన్లైన్ చేయాలి

### ఐఎఫ్టీయూ డిమాండ్




**బెల్లంపల్లి, ఆగస్టు 11, (జనంసాక్షి)** సింగరేణి సివిక్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సిఎంపీఫ్ వివరాలను ఆన్లైన్ చేయాలని ఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం బెల్లంపల్లి పట్టణంలో సివిక్ కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 200 మంది కాంట్రాక్ట్ కార్మికులకు గత నాలుగు సంవత్సరాలుగా కార్మికుల పేర్ల పైన రికవరీ అయిన సీఎంపిఎఫ్ డబ్బులకు సంబంధించిన లెక్కలు చూపించడం లేదన్నారు. సంవత్సరం తరబడి అధికారులకు సమస్య పరిష్కరించాలని కోరినప్పటికీ సమస్యను పరిష్కరించడం లేదన్నారు. భవిష్యత్తులో సీఎంపిఎఫ్ ఆఫీస్ ముందు సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈసమావేశంలో నాయకులు వెంకటి, శీను, దిలీప్, కుమార స్వామి కృష్ణవేణి, లత, పద్మ, కర్ణ శంకర్, సంధ్య, లలిత, దుర్గా, అమృత, రాజేశ్వరి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలి

### కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్.



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 11(జనంసాక్షి ):** ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలతో జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో రైతులు వరి నాట్లు వేస్తున్నట్లు గమనించామని తెలిపారు. ఎల్‌నినో ప్రభావం ఈ ఏడాదితో పాటు వచ్చే ఏడాది వరకు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బోరుబావులు ఉన్న రైతులు సైతం వరి సాగుకు అవసరమైన నీరు అందుబాటులో ఉంటుందా అనే విషయాన్ని ఆలోచించుకోవాలని అన్నారు. జిల్లాలో ఇతర ప్రాంతాలతో పోలిస్తే వర్షపాతం మెరుగ్గా ఉన్నప్పటికీ, వరి సాగుకు సరిపడా నీటి లభ్యత ఉండకపోవచ్చని పేర్కొన్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఆరుతడి పంటలు సాగు చేసి రైతులు అధిక దిగుబడులతోపాటు లాభాలు పొందాలని కోరారు.

### 15 నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

రాష్ట్ర ప్రభుత్వం రేషన్ లబ్ధిదారులకు అందజేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఈ నెల 15 నుంచి ప్రారంభించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. మండల, గ్రామస్థాయిలో ప్రణాళికాబద్ధంగా కార్డుల పంపిణీకి చర్యలు చేపట్టినట్లు వివరించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే మూడు నెలలకు సరిపడా రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రేషన్ బియ్యం అక్రమ తరలింపుపై నిఘా ఏర్పాటు చేశామని, ఎక్కడైనా అక్రమంగా తరలిస్తే ప్రజలు అధికారులకు సమాచారం అందించాలని కోరారు. రేషన్ బియ్యం అక్రమంగా తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్






**మంచిర్యాల ప్రతినిధి, ఆగస్టు 11, జనంసాక్షి** ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసి విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని హాజీపూర్ మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి అదనపు గదులు, భోజనశాల నిర్మాణ పథకం, వంటశాల, రిజిస్టర్లు, పారిశుద్ధ్య నిర్వహణ అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసే చర్యలలో భాగంగా చేపట్టిన అదనపు గదులు, భోజనశాల నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలతో కూడిన ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. వర్షాకాలం అయినందున పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం ముల్కల్ల లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ విద్యా సంస్థలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థులతో మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, మధ్యాహ్న భోజనం నాణ్యత, విద్య బోధన అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి, ఆగస్టు 11, జనం సాక్షి** జిల్లాలో నెల 15వ తేదీన నిర్వహించనున్న స్వాతంత్ర దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా అటవీ శాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు లతో కలిసి అన్ని శాఖల జిల్లా అధికారులతో స్వాతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ఈ నెల 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లాలోని సమీకృత కార్యాలయాల భవన సముదాయం ఆవరణలో వేడుకలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేసి వేడుకలను విజయవంతం చేయాలని తెలిపారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గౌరవ వందనం, మంచిర్యాల,నస్పూర్ మండలాల తహసిల్దార్ల సంయుక్త ఆధ్వర్యంలో కుర్చీలు, ఇతర ఏర్పాట్లు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో త్రాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణ, జిల్లా పౌర సంబంధాల అధికారి ఆధ్వర్యంలో ముఖ్య అతిథి సందేశం, జిల్లా విద్యాధికారి ఆధ్వర్యంలో జాతీయ గీతాలాపన, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. అధికారులు, అనధికారులు, ప్రముఖులు, మీడియా ప్రతినిధులు, ప్రశంసా పత్రాల గ్రహీతలు, ప్రజలు కూర్చునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రశంసా పత్రాల పంపిణీ, పతాక ఆవిష్కరణ, వేదిక అలంకరణ, పుష్పగుచ్చాలు, వేదిక తయారీ, టెంట్, కుర్చీలు, సౌండ్ సిస్టం, మైక్, ప్రోటోకాల్ ప్రకారంగా ప్రముఖుల ఆహ్వానం, నిరంతర విద్యుత్ సరఫరా, అత్యవసర ఏర్పాట్లు, అగ్నిమాపక, వైద్య సేవలు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది వేడుకలకు తప్పనిసరిగా హాజరు కావాలని, వేడుకలను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేసే దిశగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మోతీరామ్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాసరావు, మంచిర్యాల ఎసిపి ప్రకాష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీస్ అధికారులు.



# జనసేన పార్టీ చేస్తున్న మంచి పనులను చూసి పార్టీలో చేరాను

## సీనియర్ నాయకుడు ప్రభాకర్




**వరంగల్ ఈస్ట్, ఆగస్టు 11 (జనం సాక్షి)** జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రజలకు చేస్తున్న మంచి పనులను చూసి ఆకర్షితుడనై జనసేన పార్టీలో చేరినట్లు సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కరాటే ప్రభాకర్ అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ తాను కాంగ్రెస్ పార్టీలో నిస్వార్థపరుడుగా, నిజాయితీపరుడుగా గత 30 ఏళ్లుగా సేవ చేశానన్నారు. కానీ తనకు ఎలాంటి గుర్తింపు ఇవ్వకుండా కొందరు మరళి తనను అనేక రకాలుగా ఇబ్బంది పెట్టినట్టు తెలిపారు. తనకు పదవులు ఇస్తానని చెప్పి అన్యాయం చేశారన్నారు. ఆయనకు సంబంధించిన అనుచరులకు, కుటుంబ సభ్యులకు బంధువులకు మాత్రమే కొండ పనిచేస్తున్నాడని విమర్శించారు. కొండ అరాచకాలు భరించలేకపోయాను అన్నారు. పవన్ కళ్యాణ్ ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం గా ఉండడమే కాకుండా జనసేన పార్టీ అధినేతగా సామాన్య ప్రజల కోసం , వారి అభివృద్ధి కోసం నిరంతరం పాట పాడుతున్నాడని ప్రభాకర్ అన్నారు. ఆయన చేస్తున్నటువంటి ప్రజోపయోగ కార్యక్రమాలు తనకు నచ్చాయని అందుకే జనసేన పార్టీలో చేరినట్టు ప్రభాకర్ తెలిపారు. జనసేన పార్టీ తనకు ఎలాంటి బాధ్యత అప్పజెప్పిన ఉత్సాహంగా పనిచేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు దామోదర్ రెడ్డి, శివకోటి, ప్రశాంత్ రెడ్డి, సురేష్ రెడ్డి, సునీత గౌడ్, రామా గౌడ్, రవీష్ , పృధ్వీ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కార్యాలయాల మధ్య బురదమయం...!

### ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు, గ్రామాలలోని ప్రజలు, పట్టించుకోని సంబంధిత అధికారులు.




**చెన్నారావుపేట, ఆగస్టు 11 ( జనం సాక్షి):** ప్రభుత్వ కార్యాలయాల మధ్య బురదమయంగా మారింది. ఆ బురదమయమైన రోడ్డు గుండానే సంబంధిత అధికారులు నిత్యం ప్రయాణిస్తున్నారే తప్ప కనీసం ఆ బురదమయమైన రోడ్డును బాగు చేసుకుందామని మాత్రం అనడం లేదు. గ్రామాలలోకి వెళ్లి మాత్రం అధికారులు తమ చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి... అసలే వర్షాకాలం బురదమయం లేకుండా పలు జాగ్రత్తలు పాటించాలని నీతులు ఒలకబోస్తారు తప్ప తమ కార్యాలయాల చుట్టూ ఉన్న పరిసరాలను, బురదమయంగా మారిన రహదారిని మాత్రం పట్టించుకోరని పలువురు బాహాటంగా ఆరోపిస్తున్నారు. ఒకవైపు చెన్నారావుపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయం, మరోవైపు మండల విద్యా వనరుల కేంద్రం కార్యాలయాలు ఉన్నాయి. వాటి పక్కనే మొత్తం బురదమయంగా తయారయింది. ఈ బురదమయమైన రహదారి నుండే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కార్యాలయం, ఇందిరా క్రాంతి పథకం కార్యాలయం, ఇందిరమ్మ మోడల్ హౌస్, 108 వాహన కార్యాలయాలకు వెళ్లాల్సి ఉంది. నిత్యం అధికారులు ఈ రహదారి గుండానే ప్రతిరోజు వెళ్తుంటారు. కానీ ఆ అధికారులకు ఈ బురదమయంగా మారిన రోడ్డు మాత్రం కనిపించడం లేదేమో... అని పలువురు ప్రశ్నిస్తున్నారు. అంతేకాక వివిధ అవసరాల రిత్యా ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ఉద్యోగులు, గ్రామాలలోని ప్రజలు ఈ బురదమయమైన రోడ్డు గుండా వెళ్లాలంటే అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ అధికారులు గ్రామాలలోకి వస్తే మాత్రం తమ ఇంటి చుట్టూ ఉన్న పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి... బురదమయంగా లేకుండా చూసుకోవాలి ఇలా.. అలా... అంటూ నీతులు చెబుతున్నారే తప్ప తమ చుట్టూ ఉన్న పరిసరాలు బురదమయంగా మారిన రోడ్డు ఈ విధంగా ఉంటే ఎలా... అని పలువురు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తాము నిత్యం ప్రయాణించే బురదమయంగా మారిన రహదారిని బాగు చేసుకోవాలని వివిధ అవసరాలరిత్యా ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే పలు గ్రామాల ప్రజలు, పలువురు కోరుతున్నారు.

# వరి సాగుతో పాటు ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి సారించాలి

- స్టేషన్ ఘన్పూర్ ఏడీఏ అపర్ణ
- నీటి వనరుల సమర్థ నిర్వహణకు పటిష్ట కార్యాచరణ అమలు చేయాలి
- డీఆర్డీఓ బాస్కర్



**స్టేషన్ ఘన్పూర్, ఆగస్టు 11 ( జనం సాక్షి ) :** వరి సాగుతో పాటు ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి సారించాలని స్టేషన్ ఘన్పూర్ వ్యవసాయశాఖ ఏడీఏ అపర్ణ అన్నారు.మండలం లోని తాటికొండ రైతు వేదికలో ఏర్పాటు చేసిన రైతు అవగాహన సదస్సు కు ఏఈఓ బోడ శ్రావణి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిలుగా హాజరై న ఏడీఏ అపర్ణ, డీఆర్డీఓ బాస్కర్ మాట్లాడుతూ రైతులకు ప్రస్తు త సాగునీటి పరిస్థితులు, నీటి లభ్యత,పంట మార్పిడి, కంటింజెన్సీ పంటల సాగుపై అవగాహ న కల్పించారు. జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు, ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం, సాగునీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని స్టేషన్ ఘనపూర్ మండలంలోని రైతులు అధిక నీటి అవసరం కలిగిన వరి సాగుకు బదులుగా తక్కువనీటితో సాగు చేయగల ప్రత్యా మ్నాయ పంటలనుఎంచుకోవాలని సూచించారు. మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకొని పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా సాగునీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో వరి సాగు చేపట్టి నష్టపోకుండా కందులు, పెసర్లు, అలసందలు,జొన్న, మొక్కజొన్న,చిరుధాన్యాలు, పొద్దుతిరుగుడు తదితర తక్కువ నీటి అవసరం కలిగిన కంటింజెన్సీ పంటల వైపు మళ్లాలని రైతు లను ప్రోత్సహించారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా,సమర్థవంతంగా వినియో గించుకోవాలని, వ్యవసాయ శాఖ సూచనలకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించుకో వాలని రైతులకు సూచించారు. ప్రత్యామ్నాయ పంటల సాగుతో నీటి వినియోగాన్ని తగ్గించడం తో పాటు వర్షాభావ పరిస్థితుల్లో పంట నష్టాన్ని కూడా తగ్గించుకోవచ్చని వివరించారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో వరి సాగుకు దూరంగా ఉండి ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహించాలని అన్నారు.రైతులకు ప్రాధాన్యత క్రమంలో సాగునీరు అందించాలని అన్నారు.ఈ కార్య క్రమంలో గ్రామ సర్పంచ్ మారపాక సుజన శ్రీనివాస్,డీఆర్ డీఓ భాస్కర్ ,డీపీఎం నళిని, ఎఈఓ శ్రావణి, సిసి సహదేవ్, పంచాయితీ కార్యదర్శి రాజేందర్,చిల్పూర్ ఏపిఎం పిట్టల నరేందర్,కారోబార్ సలీం , రికార్డు అసిస్టెంట్ పోకల నరేష్, రైతులు పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం



**నల్లబెల్లి, ఆగస్టు 11 (జనంసాక్షి):** వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం మామిండ్లవీరయ్యపల్లి గ్రామానికి చెందిన నిరుపేద వ్యక్తి పొన్నర్సు వెంకటేశ్వర్లు అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన అంత్యక్రియలు నిర్వహించేందుకు కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం నాగరాజుపల్లి గ్రామ మాజీ సర్పంచ్ గోనె శ్రీదేవి, పంతులుపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కర్లకంటి రాంమూర్తి దృష్టికి తీసుకొచ్చింది. రాంమూర్తి తన స్వంత మండలమైన గీసుకొండలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ప్రముఖ పారిశ్రామికవేత్త అల్లం బాల కిశోర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని కోరారు. స్పందించిన బాల కిశోర్ రెడ్డి రూ.5,000 ఆర్థిక సహాయాన్ని పంపించారు. ఈ మొత్తాన్ని మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఏడాకుల సరోజన-సంపత్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఆసం చంద్రమౌళి, ఉపాధ్యాయులు కునమల్ల రాజన్ బాబు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ఆపదలో ఉన్న కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన బాల కిశోర్ రెడ్డికి పలువురు అభినందనలు తెలిపారు.

# ఘనంగా బోనాల జాతర



**రామకృష్ణాపూర్, ఆగస్ట్ 11(జనంసాక్షి):** మందమర్రిపట్టణంలో బోనాల జాతరను మంగళవారం ఘనంగా నిర్వహించారు. వెంకటేశ్వర టెంపుల్ నుంచి సీఎస్పీ వరకు భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాలు సమర్పించారు. డప్పుచప్పుళ్ళ, మేళతాళాల నడుమ బోనాల ఊరేగింపు ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, పట్టణ ఎస్ఐ నరేష్ బోనాలు ఎత్తుకుని జాతరలో పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో జాతర ప్రాంతం సందడిగా మారింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# గొర్రె మేకలకు నోరు పుండ్ల నివారణ టీకాలు



**సారంగాపూర్, ఆగస్టు11 (జనం సాక్షి)** సారంగాపూర్ మండలంలో లింగాపూర్ గ్రామపంచాయతీలో మంగళవారం పశువుల గొర్రె మేకలకు నోటి పుండ్లకు వైద్య అధికారి నందకుమార్ చికిత్స చేశారు.వాటికి సంబంధించిన టీకాలు మందులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమం లో లింగాపూర్ సర్పంచ్ ప్రతాప్ గొర్రె మేకల యజమానులు మరియు పశు వైద్య సిబందిమల్లికార్జున , దిలీప్, రాజేందర్ పాల్గొనారు .

# యూనిఫాంల తయారీని వేగవంతం చేయాలి

## కలెక్టర్ రాజర్షి షా



**ఉట్నూర్ ఆగస్టు 11 (జనం సాక్షి)** ఉట్నూర్ మండలంలోని లింగోజి తండా గ్రామపంచాయతీ పేర్లగూడ గ్రామంలోగల ఇందిరా మహిళా శక్తి కుట్టు మిషన్ కేంద్రాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ రాజర్షిషా సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న పాఠశాల విద్యార్థుల యూనిఫాంల కుట్టు ప్రక్రియను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు అందజేసే యూనిఫాంల కుట్టు పనిని నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, నిర్ణీత గడువులోగా వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను, నిర్వాహకులను ఆదేశించారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఇందిరా మహిళా శక్తి కేంద్రాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంలు రామారావు, సీసీలు లక్ష్మణ్, కిషన్ రావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి జాదవ్ రంజిత్ లతో పాటు కేంద్రం నిర్వాహకురాలు జ్యోతి, ఇతర దర్జీలు, సిబ్బంది పాల్గొన్నారు.

# నెన్నెల పోలీస్ స్టేషన్‌లో ఏసీపీ వార్షిక తనిఖీ





నెన్నెల, ఆగస్టు 11 (జనం సాక్షి) బెల్లంపల్లి సబ్ డివిజన్ ఏసీపీ వి. కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం నెన్నెల పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన సాధారణ రికార్డులు, కేసు ఫైళ్లు, స్టేషన్ పరిసరాలు, పరిశుభ్రత, ఇతర పరిపాలనా అంశాలను ఏసీపీ క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డుల నిర్వహణ, శాఖాపరమైన నిబంధనలు, విధుల అమలు తీరును సమీక్షించారు. అనంతరం పోలీస్ సిబ్బందితో సమావేశమై మాట్లాడిన ఏసీపీ.. స్టేషన్‌కు సంబంధించిన అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించి సక్రమంగా నిర్వహించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు సమర్థవంతమైన, ప్రజానుకూల పోలీసింగ్ అందించేందుకు సిబ్బంది నిరంతరం కృషి చేయాలని సూచించారు. పోలీస్ సిబ్బంది క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వహిస్తూ వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని, పోలీస్ శాఖ గౌరవం, ప్రతిష్ఠను కాపాడేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఏసీపీ కిరణ్ కుమార్ సూచించారు. వార్షిక తనిఖీలో పోలీస్ స్టేషన్ సిబ్బంది ఎస్సై జగదీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అడ్వకేట్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి



మంచిర్యాల ఆగస్టు 10 జనంసాక్షి మంచిర్యాల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్వకేట్స్ మంచిర్యాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు .ఈ టోర్నమెంట్ ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీరయ్య టాస్ వేసి పోటీలను ప్రారంభించడం జరిగింది. దీంట్లో గ్రీన్ టీం అండ్ ఎల్లో టీం తలపడ్డాయి.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొత్త సత్తయ్య, గడ్డం శ్రీనివాస్ ,చుంచు సదానందం,సురేంద్ర ఉపాధ్యాయ ,నిశాంత్ గాంధీ, తుల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# దుబ్బపల్లి పాఠశాలలో గోరింటాకు సంబరాలు



నెన్నెల, ఆగస్టు 11 (జనం సాక్షి ) నెన్నెల మండల కేంద్రంలోని దుబ్బపల్లి ప్రాథమిక పాఠశాలలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని మంగళవారం గోరింటాకు సంబరాలను ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని గోరింటాకు పెట్టుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్ మాట్లాడుతూ ఆషాఢ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో ఒక భాగమని తెలిపారు. విద్యార్థులకు సంప్రదాయాలపై అవగాహన కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్ సబిత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అవినీతిపై యువతే అస్త్రం

## భైంసాలో ఈ నెల 22న జిల్లా స్థాయి అవగాహన సదస్సు



నిర్మల్ టౌన్,ఆగస్టు 11:(జనంసాక్షి ) అవినీతి, లంచాలకు వ్యతిరేకంగా యువతలో చైతన్యం కల్పించేందుకు యాంటీ కరప్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 22న భైంసాలో జిల్లా స్థాయి అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మంగళవారం నిర్మల్ ప్రెస్‌క్లబ్‌లో 'మీట్ ది ప్రెస్'లో సదస్సు గోడపత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో భాగంగా 18 ఏళ్లు పైబడిన విద్యార్థులకు 'అవినీతి నిర్మూలనలో యువత పాత్ర' అంశంపై ఈ నెల 16న జిల్లా స్థాయి వ్యాసరచన పోటీ నిర్వహించనున్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 14లోపు 9705310805 నంబరులో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రథమ బహుమతి రూ.5 వేలు, ద్వితీయ రూ.2 వేలు, తృతీయ రూ.1,500 అందించనున్నారు. విజేతలకు ఈ నెల 22న భైంసాలో జరిగే సదస్సులో బహుమతులు అందజేయనున్నారు.

# పాఠశాలల్లో ఇంగ్లీష్‌పై పట్టు సాధించాలి: జిల్లా కలెక్టర్ రాజర్షిషా



మావల ఆగస్ట్ 12 ( జనం సాక్షి): పాఠశాల విద్యార్థుల్లో అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలను పెంపొందించేందుకు 'స్పోకెన్ ఇంగ్లీష్' కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జడ్పీ సమావేశ మందిరంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'స్పోకెన్ ఇంగ్లీష్ ప్రోగ్రామ్, అదిలాబాద్' ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని సుమారు 250 నుంచి 260 పాఠశాలల్లో స్పోకెన్ ఇంగ్లీష్ కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. రాబోయే ఆరు నెలల కాలంలో ప్రతినెలా 40 పాఠశాలల చొప్పున ఈ శిక్షణను విస్తరిస్తామని పేర్కొన్నారు. ప్రతి నెల చివరి వారంలో జిల్లా స్థాయిలో 'స్పోకెన్ ఇంగ్లీష్ ఛాంపియన్‌షిప్' పోటీలు నిర్వహిస్తామని వెల్లడించారు. విద్యార్థులు నలుగురిలో ధైర్యంగా మాట్లాడేలా, వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపేలా ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని వ్యాఖ్యానించారు. ముఖ్యంగా తరగతి గదిలో లేదా వేదికపై మాట్లాడటానికి వెనుకబడే విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అదనపు సమయాన్ని కేటాయించి, ప్రతి ఒక్కరిలోనూ ఆంగ్ల భాషా పరిజ్ఞానాన్ని పెంపొందించాలని, ఏ ఒక్క విద్యార్థినీ వదిలేయకూడదని స్పష్టం చేశారు. బోధనా ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకు 'శిక్షా కోపైలట్' వంటి ఆధునిక సాంకేతిక పరికరాలు, స్మార్ట్ మెటీరియల్స్ వీడియోలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ విద్యా సంవత్సరంలో ఈ ప్రాజెక్ట్‌ను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని, విద్యార్థుల ప్రగతి నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు సమన్వయంతో కృషి చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన స్పోకెన్ ఇంగ్లీష్ పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి, అకడమిక్ కో ఆర్డినేటర్లు లక్ష్మణ్, అజయ్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జేఏసీ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సదస్సును విజయవంతం చేయాలి



తాండూర్, ఆగస్టు 11(జనం సాక్షి) మంచిర్యాల జిల్లా : తాండూర్ మండలా కేంద్రం ఐబీ ఫ్లైఓవర్ కింద తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు 80 సంవత్సరాల చరిత్రలఏ ప్రభుత్వం కూడా ఇంత అన్యాయం చేయలేదు మార్పు కావలనంట్టు మా ఓట్లతో గద్దెనెక్కి మంగళవారం రోజున ఆటో డ్రైవర్స్ ఉన్నారన్న విషయాన్ని మరచి ఇప్పుడికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పాతకం వల్ల ఆర్థిక ఇబ్బదుల తో సమతం అవుతున్న ఆటో కార్మికులకు ములిగే నక్క పై తాటి పండు పడ్డట్టు ఫాస్ట్ మెయిల్ టూ లాస్ట్ మెయిల్ అంటు బస్సు టికెట్ తో పాటు ఇంటి నుడి గమ్య సతనం వరకు టికెట్టు ఇచ్చి ప్రయానికులకు ఇంటి కి చెర్చే ప్రయత్నాలు కార్పొరేటర్ సామూస్తా కు పట్టం కట్టాడన్ని మేము కండిస్తూ 13/08/2026 రోజున సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో నిర్వహిస్తున్న రాష్ట్ర వ్యాప్తంగా సదస్సును విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర యాప్ అందరిత జెఏస్సి వారు ఇచ్చిన పిలుపును గురవించి ఆటో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తాండూరు మండలం ఆటో యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మరియు మంచిర్యాల జిల్లా భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ హబీబ్ పాషా పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మండల స్థాయి నాయకులు వివిధ అడ్డాల అధ్యక్షులు ఉపాధ్యక్షులు కోశాధికారులు మాతోటి ఆటో కార్మికులు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్ల హామీలు నెరవేర్చకుంటే రాష్ట్ర వ్యాప్త సమ్మె



స్టేషన్ ఘన్‌పూర్, ఆగస్టు 11 ( జనం సాక్షి ) : ఆటో డ్రైవర్ల హామీలు కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నెరవేర్చకుంటే రాష్ట్ర వ్యాప్త సమ్మె నిర్వహిస్తామని ఆటో డ్రైవర్ల యూనియన్ అధ్యక్షుడు గుర్రం మధుమోహన్ డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్ల బందు పిలుపులో భాగంగా జిల్లా కమిటీ ఆదేశాల మేరకు ఆటోకార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం స్టేషన్ ఘన్పూర్ మున్సిపాల్టీ పరిధిలోని శివునిపల్లి అంబేద్కర్ సర్కిల్ నుంచి పట్టణ కేంద్రంలోని జాతీయ రహదారి బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వర కు మండలంలోని ఆటో డ్రైవర్లతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్ల యూనియన్ మండల అధ్యక్షుడు గుర్రం మధుమోహన్ మాట్లా డుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని, హామీలను అమలు చేయకుంటే ఈ నెల 24న రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున సమ్మె చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆటో డ్రైవర్లకు ఆర్థిక సహాయం అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని కోరారు. ఆటో కార్మికుల సంక్షేమం కోసం వెయ్యి కోట్లతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాం డ్ చేశారు. ప్రమాద బీమా పథకాన్ని పునరుద్ధరిం చాలని, ఆత్మహత్య చేసుకున్న ఆటో డ్రైవర్ల కుటుంబాలకు20లక్షలరూపాయలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. ఈ-ఆటో నిర్ణయాన్ని ఉప సంహరించుకోవాలని, ఉచిత బస్సు పథకాన్ని వృద్ధులు, విద్యార్థులకు మాత్రమే పరిమితం చేయాలని, ఉద్యోగులకు ఉచిత బస్సు సౌకర్యా న్ని ఎత్తివేయాలని కోరారు. ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సమస్యలపై సానుకూలంగా స్పందించి ఇచ్చిన హామీలను అమలు చేయాలని అన్నారు. హామీల అమలుపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షుడు సింగపురం వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి నీల మొగిలి, కార్యదర్శి భాస్కుల సమ్మయ్య, సహాయ కార్యదర్శి రాజారపు జయపాల్,ఎండీ అన్వర్‌పాషాతోపాటు మండలంలోని పలువురు ఆటో డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ధరలు తగ్గించి... ఖాళీ ఉద్యోగాలు భర్తీ చేయాలి

## లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా




**నల్లబెల్లి, ఆగస్టు 11 (జనంసాక్షి):** నిత్యావసర వస్తువులు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు చింతకింది కుమారస్వామి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్ లు రద్దు చేయాలని మంగళవారం మండల కేంద్రంలో సిపిఐ, సిపిఎం మండల నాయకుల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ రైతు ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని, రైతులు పండించిన పంటలను వంద శాతం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కేవలం 35 శాతం పంటలనే కొనుగోలు చేస్తామనడం రైతు వ్యతిరేక విధానాలకు నిదర్శనమన్నారు. పంటల నిల్వలకు సరిపడా గోదాములు నిర్మించాలని కోరారు. దశాబ్దాలుగా కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను హరించేలా కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడం సరికాదన్నారు. లేబర్ కోడ్‌లను తక్షణమే ఉపసంహరించుకోవాలని, కార్మిక సంక్షేమం, అభివృద్ధిపై ప్రభుత్వాలు దృష్టి సారించాలని కోరారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీని కేంద్ర ప్రభుత్వం నెరవేర్చలేదని విమర్శించారు. ఖాళీగా ఉన్న పది లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని నల్లబెల్లి మండల తహసీల్దార్ ద్వారా ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం మండల నాయకులు బొడిగె సమ్మయ్య, మామిళ్ల పెద్ద ఐలయ్య, కడియాల క్రాంతికుమార్, ఇస్లావత్ రవి, ఆవాల సంపత్ రావు, గట్టి పాపయ్య, మర్రి రమేష్, బొడిగె నారాయణస్వామి, దిండు బాబు, కనకం సాగర్, కత్తి సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రూ. 50వేల షూస్ పంపిణీ

## ఉప్పరపల్లి విద్యార్థుల అడుగులకు ఉమామహేశ్వర్ రెడ్డి -స్నేహలత దంపతుల ముందడుగు




**చెన్నారావుపేట, ఆగస్టు 11( జనం సాక్షి):** విద్యార్థుల విద్యాభివృద్ధితో పాటు వారి ఆరోగ్యం, సౌకర్యం, ఆత్మవిశ్వాసానికి తోడ్పడటమే లక్ష్యంగా చెన్నారావుపేట మండలంలోని ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. ఉమామహేశ్వర్ రెడ్డి--స్నేహలత దంపతుల నేతృత్వంలో రోటరీ క్లబ్ ఆఫ్ హనుమకొండ ఆధ్వర్యంలో పాఠశాలలోని 125 మంది విద్యార్థులకు సుమారు రూ.50 వేల విలువైన షూస్‌ను మంగళవారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి చెన్నారావుపేట మండల స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ టి. బాలాజీ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు షూస్ అందజేశారు. పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు తేజావత్ జయ అధ్యక్షత వహించారు. హనుమకొండ రోటరీ క్లబ్ అధ్యక్షులు వంగ రాజిరెడ్డితో పాటు రోటరీ క్లబ్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన వస్తువులను అందించడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే కాకుండా విద్యపై మరింత ఆసక్తి కలిగించవచ్చని అన్నారు. విద్యార్థులకు సేవ చేయడం గొప్ప సామాజిక బాధ్యత అని, ఇలాంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న రోటరీ క్లబ్‌ను ఆయన అభినందించారు. హనుమకొండ రోటరీ క్లబ్ అధ్యక్షులు వంగ రాజిరెడ్డి మాట్లాడుతూ సమాజానికి సేవ చేయాలనే ఉద్దేశంతో తమ సంస్థ వివిధ సేవా కార్యక్రమాలను చేపడుతోందని తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన సహాయాన్ని అందించడం ద్వారా వారి విద్యాభ్యాసానికి తోడ్పడాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. పాఠశాల విద్యార్థులకు షూస్ అందించడం వల్ల పాఠశాలకు ప్రతిరోజూ క్రమబద్ధంగా, సౌకర్యవంతంగా హాజరు కావడానికి ఎంతో ఉపయోగపడుతుందని పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు తేజావత్ జయ తెలిపారు. విద్యార్థుల అవసరాలను గుర్తించి వారికి సహాయం అందిస్తున్న రోటరీ క్లబ్‌కు పాఠశాల తరపున కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు తమలోని ప్రతిభను వెలికితీసుకుని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించేలా ఉపాధ్యాయులు నిరంతరం ప్రోత్సహిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సేవా కార్యక్రమం ద్వారా పాఠశాలలో చదువుతున్న 125 మంది విద్యార్థులకు రూ.50 వేల విలువైన షూస్ అందినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు రోటరీ క్లబ్ ప్రతినిధులకు, దాతలు ఉమామహేశ్వర్ రెడ్డి స్నేహలత రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సమాజంలోని దాతలు, స్వచ్ఛంద సంస్థలు, సేవా సంస్థలు అందించే సహకారం ఎంతో విలువైనదని అవయవ దాతల సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొన్ రెడ్డి మల్లారెడ్డి తెలిపారు. విద్యార్థులకు అవసరమైన వస్తువులు అందించడం ద్వారా వారి కుటుంబాలపై కొంత ఆర్థిక భారాన్ని తగ్గించడంతో పాటు, విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచవచ్చని గ్రామ సర్పంచ్ చిలపాక అనిత మొగిలి అన్నారు. ఈ సందర్భంగా దాతలు ఉమామహేశ్వర్ రెడ్డి స్నేహలత, మండ వేణులను శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు మట్టపల్లి ప్రభాకర్ రావు, పన్యాల రవీందర్ రెడ్డి, సీతారామారావు, ఎం. రామారావు, మండ వేణు, రామ హరిప్రసాద్, గంగోజుల నరేష్, ఉప్పరపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సుధాకర్ రెడ్డి, రమేష్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# తిరంగాతో దేవరుప్పులలో దేశభక్తి వెల్లువ



**దేవరుప్పుల, ఆగస్టు 11 (జనం సాక్షి):** దేవరుప్పుల మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు బస్వ భాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా యాత్రను ఘనంగా నిర్వహించారు. బాల యేసు స్కూల్ నుంచి కామారెడ్డిగూడెం ఎమ్మార్వో కార్యాలయం వరకు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వందేమాతరం గీతాన్ని ఆలపిస్తూ దేశభక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆగస్టు 10 నుంచి 15 వరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. జాతీయ జెండా మన దేశ ఐక్యతకు, గౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి భాగాల నవీన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షురాలు చింత సృజన, ఎండోమెంట్ జాయింట్ కన్వీనర్ భాషిపాక సుధాకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు బస్వా మహేందర్ గౌడ్ (మహేష్), సీనియర్ నాయకులు బస్వా రమేష్ గౌడ్, గోలి పెద్ద ఉప్పల్ రెడ్డి, గుంటి అజయ్, మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు, భాషిపాక కొండయ్య, బండి రాజు, దుర్గరాజు, నరేష్, వెంకటేష్, అన్వేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సంతు నాందేవ్ మహారాజ్ పుణ్యతిథి వేడుకలు



**కుంటాల, ఆగస్టు 11(జనం సాక్షి):** మేరు సంఘం ఆధ్వర్యంలో సంతు నాందేవ్ మహారాజ్ పుణ్యతిథి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ కార్యాలయంలో మహారాజ్ చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, పూలమాలలతో ఘన నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో మేరు సంఘం మండల అధ్యక్షుడు శ్రీరామ్ సంతోష్, క్యాషియర్ శ్రీరామ్ రామచందర్, కోశాధికారి ధర్పస్తు శంకర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ సంతు నాందేవ్ మహారాజ్ అందించిన సేవలను, ఆయన మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు శ్రీరామ్ శివలింగం, శ్రీరామ్ గజేందర్ (పీఆర్వో), గిరిధర్, నారాయణ సింగ్, ఏవార్ సంతోష్, గజేందర్ మరియు సంఘ ప్రతినిధులు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# నారాయణపూర్-కిష్టాపూర్ వద్ద ప్రమాదకర మలుపు



**రెబ్బెన,ఆగస్టు11(జనం సాక్షి):** రెబ్బెన నుంచి భీమిని వెళ్లే ప్రధాన రహదారిలోని నారాయణపూర్ – కిష్టాపూర్ సమీపంలో ఉన్న ప్రమాదకర మలుపు వాహనదారులకు ఆందోళన కలిగిస్తోంది. ఈ రహదారిపై నిత్యం పెద్ద సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే మలుపు వద్ద రహదారి పరిస్థితులు, వాహనాల వేగం కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ మలుపు మరింత ప్రమాదకరంగా మారుతోందని వాహనదారులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మలుపు వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు, అవసరమైన చోట రోడ్డు భద్రతా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే చర్యలు తీసుకుని ప్రాణనష్టం నివారించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# రాష్ట్ర స్థాయి బాల్ బాడ్మింటన్ టోర్నమెంట్లో ప్రతిభ కనబరిచిన మోడల్ కళాశాల విద్యార్థిని



**కాసిపేట ఆగస్టు 11 ( జనం సాక్షి )** కాసిపేట మండలంలోని తెలంగాణ మోడల్ కళాశాల ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థిని పూదరి శ్రావ్య, రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ద్వితీయ బహుమతి సాధించినట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. ఈ నెల 7,8 మరియు 9వ తేదీల్లో వనపర్తిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో సీనియర్ బాలికల విభాగంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ప్రాతినిధ్యం వహించి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తాచాటిన శ్రావ్య ను ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్, వ్యాయమ ఉపాధ్యాయుడు పి.శ్రీనివాస్ గౌడ్, పాఠశాల సిబ్బంది అభినందించారు.

# నల్లబెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆకస్మిక తనిఖీ



**నల్లబెల్లి, ఆగస్టు 11 (జనంసాక్షి):** నల్లబెల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా. బి. రాజారెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. ప్రకాశ్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వివిధ వైద్య సేవలు, రికార్డులను పరిశీలించి, సిబ్బంది పనితీరును సమీక్షించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు, ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, సంబంధిత రికార్డుల నిర్వహణ తదితర అంశాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల్లో మెరుగైన పనితీరును కనబరిచేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు, ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను సమర్థవంతంగా సాధించే దిశగా ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ ఆచార్య, సిబ్బంది పాల్గొన్నారు.

## రాఘవరెడ్డి పేట గ్రామంలో వనమహోత్సవ కార్యక్రమం



టేకుమట్ల ఆగస్టు 11 జనంసాక్షి టేకుమట్ల మండలంలోని రాఘవరెడ్డిపేట గ్రామంలో స్థానిక సర్పంచ్ వంగ మమత శ్రీధర్ ఆధ్వర్యంలో మంగళవారం వనమహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు అనంతరం నర్సరీలో పెంచిన మొక్కలను ఇంటింటికీ పంపిణీ చేశారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణం అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలను పెంచి పర్యావరణాన్ని కాపాడాలని సర్పంచ్ వంగ మమత శ్రీధర్ కోరారు. వనమహోత్సవంలో అందించిన మొక్కలను ఇంటి ఆవరణలో పెంచి, ప్రతి మొక్కను చంటి బిడ్డలా చూసుకోవాలని సూచించారు రాఘవరెడ్డి పేట గ్రామాన్ని హరిత గ్రామంగా మార్చడమే లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ పవన్ కారోబార్ తిరుపతి గ్రామస్తులు వంగ రాజయ్య, వేణువంక తిరుపతి,వంగ కరుణ, వేణువంక రవీందర్,దూడపాక రాజయ్య, ముంజల తిరుమల,చిలుక రవీందర్, సమ్మయ్య,సంతోష్,సంపత్,విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే వినోద్ పెళ్లి రోజు సందర్భంగా పండ్లు పంపిణీ



తాండూర్, ఆగస్టు 11(జనం సాక్షి) బెల్లంపల్లి ఎమ్మెల్యే శ్రీ గడ్డం వినోద్ వెంకటస్వామి రామా వివాహ దినోత్సవ శుభ సందర్భంగా తాండూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెద్దబోయిన శంకర్( ఆర్ఎంపి )ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ రూప్సీ రాణి సమక్షంలో పండ్లు మరియు ఎనర్జీ డ్రింక్ పంపిణీ కార్యక్రమం చేయడం జరిగింది. మరియు మదర్స్ పాఠశాలలో పండ్ల పంపిణీ కార్యక్రమం చేయడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంచిర్యాల జిల్లా డిసిసి ఉపాధ్యక్షులు సూరం రవీందర్ రెడ్డి.మాజీ జడ్పీటీసీ సలిగామ బానయ్య పాల్గొనడం జరిగింది.. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ మోమినాలి , జనరల్ సెక్రెటరీ కటకాల మల్లేష్, సెక్రెటరీ సాంబయ్య, మాదారం ఉప సర్పంచ్ దామోదర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కమాని శ్రీనివాస్, తాండూర్ మండల్ సోషల్ మీడియా కో ఆర్డినటర్ దుర్గం మహేందర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పుప్పం గౌడ్, ఎండి గౌస్, జావిద్, చీకటి వెంకటేష్ గౌడ్, తాళ్లపల్లి వెంకట్ గౌడ్, పుట్ట శీను, జీతుల వేణు, ఇందూరి సత్తయ్య, మాసాడి ప్రభాకర్, పెద్ద పోయిన పప్పీ పెద్ద పోయిన రవి, కొల్లూరి ప్రకాష్. రవి తదితరులు పాల్గొనడం జరిగింది.

## ఐదో రోజు ప్రజా పోరు యాత్ర




బెల్లంపల్లి, ఆగస్టు 11, (జనంసాక్షి) బెల్లంపల్లి మండలంలోని లంబడి తండా, తాళ్ల గురజాల, మాల గురిజాల, దుగ్నేపల్లి, పెర్కపల్లి, బట్వాన్ పల్లి, పాత బెల్లంపల్లి, ఆకెనపల్లి, లింగాపూర్ గ్రామాలలో మంగళవారం బెల్లంపల్లి సిపిఐ మండల కార్యదర్శి కామ్రేడ్ బొంతల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ప్రజా పోరు యాత్ర చేపట్టారు. ఈసందర్భంగా నియోజకవర్గ కార్యదర్శి దాగం మల్లేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి మిట్టపల్లి వెంకటస్వామి, రాష్ట్ర సమితి సభ్యురాలు బొల్లం పూర్ణిమ మాట్లాడుతూ దేశంలో బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనలో ప్రజల జీవితాలు దుర్భరమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నారని అన్నారు. యువకులు ఉద్యోగాలు లేకుండా నిరుద్యోగులుగా మారుతున్నారని, విద్య వైద్య రంగాలను ప్రైవేట్ కార్పొరేట్ వ్యక్తులకు అప్ప చెప్తూ ప్రజలను ఆర్థికంగా నష్టపరుస్తూ ప్రజలను అప్పుల పాలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ రంగాలను ప్రైవేటీకరణ చేస్తూ దేశాన్ని ఒక గజిబిజిగోళ పరిస్థితులకు నెట్టివేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు పోరాటాలకు సన్నద్ధం కావాలని, సెప్టెంబర్ 1 ఢిల్లీలో రామ్ లీలా మైదానంలో భారీ ఎత్తున జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి, బికెఎంయూ జాతీయ కౌన్సిల్ మెంబెర్ అక్కపల్లి బాపు, గుండా చంద్రమాణిక్యం, బికెఎమ్యు జిల్లా కార్యదర్శి మేకల రాజేశం, జిల్లా సమితి సభ్యులు రత్నం రాజం, జిల్లా సమితి సభ్యులు దాసరి తిరుపతి గౌడ్, బెల్లంపల్లి బ్రాంచ్ సహాయ కార్యదర్శి కొండు బానేష్, తాండూర్ మండల కార్యదర్శి గోమాస గంగారాం, గురుజాల శాఖ కార్యదర్శి బుడిమే వెంకటేష్, ఆకనపల్లి శాఖ కార్యదర్శి మిట్టపల్లి కుమారస్వామి పాల్గొన్నారు.

# ఢిల్లీ విద్యార్థుల పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలి

- దేశంలో బీజేపీని గద్దె దింపే వరకు సిపిఐ పోరుఆగదు
- సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి




హనుమకొండ (ప్రతినిధి ఆగస్టు 11 (జనం సాక్షి) : దేశంలోని ప్రజా వ్యతిరేక బీజేపీ పాలన నుండి ప్రజలకు విముక్తి కల్పించేందుకే సిపిఐ పోరాటం కొనసాగిస్తున్నదని సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కేంద్రంలో సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. స్థానిక వెయ్యి స్తంభాల దేవాలయం నుండి ఈ ప్రదర్శన హనుమకొండ చౌరస్తా మీదుగా పబ్లిక్ గార్డెన్ వరకు కొనసాగింది. సిపిఐ జాతీయ సమితి పిలుపు మేరకు దేశంలో మార్పు కోసం ఆగస్టు 6న జిల్లాలో ప్రారంభమైన పాదయాత్ర వారం రోజులుగా జిల్లాలో కొనసాగిన మంగళవారం ముగింపు సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారం కోసం సిపిఐ ప్రచార జాత పాదయాత్ర నిర్వహిస్తున్నదని, బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలే దాని పతనానికి దారి తీస్తాయని అన్నారు. దేశంలో మార్పు కోసం సిపిఐ పోరాటం సాగిస్తోందని అన్నారు. బీజేపీ 12 ఏళ్ల పాలనలో ప్రజలకు ఉపయోగకరమైన ఒక మంచి పని చేయలేక పోయిందని, ధరలను అరికట్టడంలో, ఉద్యోగాల కల్పనలో విఫలమైందని అన్నారు.మహిళా రిజర్వేషన్ విషయంలో అన్ని పార్టీలు మద్దతు ఇచ్చినా దానికి నియోజకవర్గాల పునర్విభజన బిల్లును జోడించి ఆమోదింపజేసుకోవడానికి కుట్ర పన్నారని అన్నారు.ఢిల్లీ విద్యార్థుల పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత దళితులపై, మహిళలపై అకృత్యాలు, దాడులు పెరిగాయని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంకై ఆగస్టు 6 నుండి దేశవ్యాప్తంగా సిపిఐ పాదయాత్రలు వివిధ జిల్లాలు, గ్రామీణ ప్రాంతాలు, పట్టణాల గుండా సాగుతూ అట్టడుగు వర్గాల ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమై సెప్టెంబర్ 1వ తేదీన ఢిల్లీలో దేశంలో మార్పు కోసం మహా ర్యాలీతో ముగుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి,సీనియర్ రాష్ట్ర నాయకులు టి. వెంకట్రాములు, రాష్ట్ర సమితి సభ్యులు సిరబోయిన కరుణాకర్, ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి, జిల్లా నాయకులు ఉట్కూరి రాములు, ఎన్ ఎ స్టాలిన్, కర్రె లక్ష్మణ్, మునిగాల బిక్షపతి, బత్తిని సదానందం, తదితరులు పాల్గొన్నారు.

# అయోధ్య విరాళాలపై నిగ్గు తేల్చాలి




తొర్రూరు, ఆగస్టు 10 ( జనం సాక్షి) :కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రామాలయం పేరిట కోట్లాది రూపాయలు అక్రమ మార్గం పట్టించారని, బంగారం, టన్నులకొద్దీ వెండిని మాయం చేశారని, దేశబాపితంగా రామభక్తులు ఆందోళన చెందుతున్న, నోరు మెదపని ప్రధాని బాధ్యత వహించాలని తమ్మెర విశ్వేశ్వరరావు డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, ఈనెల ఆరో తేదీ నుంచి 14 వ తారీకు వరకు గ్రామ గ్రామాన కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రచారంచేసి, సెప్టెంబరు ఒకటో తారీకు నాడు చలో ఢిల్లీ కార్యక్రమాలని విజయవంతం చేయడంలో భాగంగా, నిన్న, ఈరోజు తొర్రూరు మండలంలోని గ్రామాలలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్రలు కొన సాగుతున్న సందర్భంలో, ముగింపుగా ఈ రోజు తొర్రూరు రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో పాదయాత్ర నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని తమ్మెర విశ్వేశ్వరరావు మాట్లాడుతూ, కేంద్రాల్లో ఉన్న బిజెపి ప్రభుత్వం నీట్ పేపరు లీకు మీద, వేలాది మంది విద్యార్థులు ఢిల్లీలోని జంతర్ మంతర్ దగ్గర ధర్నా చేసిన సందర్భంలో, భాష్పవాయు గోళాలు, లాఠీ చార్జీలు చేసి చాలామంది విద్యార్థులను గాయపడిన సంఘటన మర్చిపోకముందే, జార్ఖండ్లోని ప్రభుత్వ నియామక పత్రాల పేపరుకూడా లీకు కావడం, అధికారంలో ఉన్న ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరికి నిదర్శనం అని అన్నారు. అలాగే వ్యవసాయ రంగాన్ని కుదేలు చేయడం కోసం, ఎన్నో సంవత్సరాలు పోరాడి, ఎంతోమంది కార్మికుల ప్రాణ త్యాగం చేసి సాధించుకున్న కార్మిక వర్గ హక్కులను కాలరాస్తూ, నాలుగు లేబర్ కోర్టులను తీసుకొని వచ్చి, కార్మిక వర్గం మీద ఉక్కు పాదం మోపుతున్న కేంద్ర ప్రభుత్వ విధానాన్ని తీవ్రంగా విమర్శిస్తూ ,లేబర్ కోర్టులను వెంటనే రద్దు చేయాలని ,మరొక్కసారి రైతు చట్టాలని ముందుకు తీసుకొని వస్తే తీవ్ర ప్రతిఘటన రైతుల ద్వారా ఉంటుందని హెచ్చరించారు. అలాగే రాష్ట్రంలో కూడా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఎన్నికల ముందర ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో కూడా, విఫలం చెందిందని అన్నారు .ముఖ్యంగా తొర్రూరు రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో విశ్రాంత ఉద్యోగస్తుల కొరకు ఏ.టి.ఓ ఆఫీసు ఏర్పాటు, ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయడం, 100 పడకల ఆసుపత్రి సత్వర నిర్మాణం చేయడంలో స్థానిక ఎమ్మెల్యే , ప్రజా ప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఇప్పటికైనా ఈ రెవెన్యూ డివిజన్ అభివృద్ధిలో ముందు ఉండాలని కోరుకుంటూ, రోడ్డుకి రెండు పక్కల నిర్మించిన డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి మురికి నీరు వెళ్లే మార్గం లేక షాపుల ముందర నీరు నిలువ ఉండి, మురుగువాసనతో రోగాలు వచ్చే పరిస్థితి దాపురించిందని, ఇప్పటికైనా స్థానిక మున్సిపల్ అధికారులు తగు చర్యలు తీసుకొని మురుగునీరు వెళ్లే ప్రయత్నం చేసి, డ్రైనేజీ వ్యవస్థను పటిష్టపరచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షులు ఓమా బిక్షపతి, సిపిఐ పార్టీ మండల కార్యదర్శి బందు మహేందర్, తొర్రూరు పట్టణ కార్యదర్శి ముద్దర బోయిన వెంకన్న, సిపిఐ పార్టీ మండల సహాయ కార్యదర్శి గణపురం లక్ష్మను, పేర బోయిన కిరణ, హమాలీ నాయకులు నాయకులు సూరబోయిన వీరన్న, పసలాది యాకయ్య, మంగళంపల్లి చంద్రయ్య, దాసరి కృష్ణమూర్తి, వెలిశాల ప్రభాకరు తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగులకు మోదీ ప్రభుత్వం మొండిచేయి

- పేదలపై భారం మోపుతున్న కేంద్రం
- ప్రజా చైతన్య ప్రచార యాత్రలో మాజీ ఎమ్మెల్యే రాజారెడ్డి




**పాలకుర్తి, ఆగస్టు 11(జనంసాక్షి)** ఏడాదికి 2 కోట్ల ఉద్యోగ నియామకాలు చేపడుతామని, ఎన్నికల్లో హామిలిచ్చిన బీజేపీ ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వకుండా యువతకు మొండి చేయి చూపిస్తోం దని. భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి, జనగాం మాజీ ఎమ్మెల్యే సిహెచ్, రాజారెడ్డి విమర్శించారు. మంగళవారం మండలంలోని చాకలి ఐలమ్మ చౌరస్తాలో సీపీఐ ఆధ్వర్యంలో ప్రజా చైతన్య ప్రచార యాత్ర పాలకుర్తికి చేరగా, ముఖ్యఅతిధిగా రాజారెడ్డి హాజరై మాట్లాడారు. నీట్ లీకేజీ ద్వారా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ను నరేంద్ర మోదీ ప్రభుత్వం నాశనం చేసిందని ధ్వజమెత్తారు. డీజీల్, పెట్రో, గ్యాస్ ధరలు పెంచి నిరుపేదలపై భారం మోపిందన్నారు. ప్రజాస్వామ్య రక్షణకు బ్యాలెట్ పేపర్ల ద్వారా ఎన్నికల నిర్వహణ చేపట్టాలని, మోదీ ప్రభుత్వం ఈవీఎంల ద్వారా అక్రమ పద్దతిలో అధికారాన్ని చేజించుకోవడంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీని మించిన నాయకుడు మరొకరు లేరని విమర్శించారు. ప్రజలకు న్యాయ వ్యవస్థ పట్ల నమ్మకం లేకుండా చేస్తోందని విమర్శించారు. రైతులు, కార్మిక రంగాలను విచ్చిన్నం చేస్తున్న ఘనత కేంద్ర ప్రభుత్వానిదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు అది సాయన్న, ఆకుల శ్రీనివాస్, పాతూరి సుగుణమ్మ, సొప్పరి సోమన్న, గుగులోతు సఖ, గుర్రం మధు, తదితరులు పాల్గొన్నారు.

# విగ్రహాల ఏర్పాటుకు కావాల్సింది అనుమతులు.రాజకీయ హంగామాలు కాదు

## కాంగ్రెస్ పార్టీ టిపిసిస్ సభ్యుడు రామనాథం.

**నర్సంపేట ఆగస్టు 11 ( జనం సాక్షి)** నర్సంపేట పట్టణంలోని దామెర్ చెరువు వద్ద ఏర్పాటుచేసిన పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహానికి ఎలాంటి అనుమతి లేకుండా నిర్మించారని అనుమతులు తీసుకోవాలని పదేపదే మున్సిపల్ కమిషనర్ కోరిన ధిక్కరించి విగ్రహం స్థాపించారని కాంగ్రెస్ పార్టీ టిపిసి సభ్యుడు రామనాథం . మంగళవారం అన్నారు ఆయన మాట్లాడుతూ మీరు భూమి పూజ చేసిన స్థలం అసైన్డ్ భూమి ప్రైవేట్ భూమి అనేది సంబంధం లేకుండా రోడ్డుకు ఎంత దూరంలో విగ్రహాన్ని కట్టారు . వారు గ్రహించకుండా కాంగ్రెస్ పార్టీ పై బూడిద చల్లడం వారి నైజం అని అన్నారు. రాజకీయ డ్రామాలు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం సరైనది కాదు. పేర్కొన్నారు. నర్సంపేట ప్రశాంతతను దెబ్బతీయాలని చూస్తే ప్రజలే బుద్ధి చెబుతారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు తీర్పు చెప్తారని అన్నారు. బిఆర్ఎస్ నాయకులు రాజకీయ లబ్ధి కోసమే శవరాజకీయాలు..బీఆర్ఎస్ శ్రేణులు ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఎదురుగా వివాదాస్పద రీతిలో గద్దె నిర్మించి,నర్సంపేటలో శాంతిభద్రతల సమస్యను సృష్టిస్తున్నారూ. అన్నారు. ఉదాహరణకు వైయస్సార్ విగ్రహాన్ని చూసుకుంటే రోడ్డుకి ఎంత దూరంలో విగ్రహాన్ని కట్టారు..దాని చుట్టూ పార్క్ ఏర్పాటు చేసుకొని ఎవరికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని అనుమతులతో కట్టడం జరిగింది. మీరు కూడా అదే రీతిలో మున్సిపల్ నుండి అనుమతులు తీసుకొని..భూమిలో మధ్యలో కట్టుకొని పార్కును ఏర్పాటు చేసుకుంటే ఇంత రాద్ధాంతం జరిగేదా. కాదని తెలిపారు. భూమి ఇచ్చిది దాతయే కదా..రోడ్డుమీద కట్టమని దాత చెప్పాడ మీకు.. మిగిలిన భూమిని ఏం చేస్తారో బిఆర్ఎస్ నాయకులు చెప్పాలి. అంతేకాకుండా 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న మీకు విగ్రహాలు ఎలా ఏర్పాటు చేయాలో కనీస సోయి లేదా.. విగ్రహాల ఏర్పాటుకు అనుమతి ఎలా తీసుకోవాలో కనీస జ్ఞానం లేదా అన్నారు. నర్సంపేటలో విగ్రహాలు లేవా,విగ్రహాలకు అనుమతులు ఇచ్చిన దాఖలు లేవా ఎందుకు ఇంత ఆగ మేఘాల మీద



విగ్రహం కట్టారు..కనీస నియమ నిబంధనలైనా పాటించారా... మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి హార్ట్ స్ట్రోక్ వచ్చి ఆసుపత్రి పాలైతే రాజకీయాలను పక్కనపెట్టి ఆయన బ్రతకాలని ప్రభుత్వం గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసి హైదరాబాద్ తరలించడం జరిగింది. గుర్తు చేశారు. అంతే కాకుండా ఉద్యమకారున్ని గౌరవించాలని సంకల్పంతో అధికారా లాంచనాలతో ఆయన అంత్యక్రియలను సైతం చేయడం జరిగింది. అలాంటి ప్రభుత్వం పై బురద చల్లడం సరైనది కాదు..ఆయన విగ్రహం పెట్టడానికి ఎందుకు అడ్డుపడతాము ఒకసారి ఆలోచించుకోండి. సాధారణ ప్రజలకైనా,మాజీ ప్రజాప్రతినిధులకైనా మున్సిపల్ చట్టాలు సమానంగా వర్తిస్తాయి..అనుమతి లేకుండా రాత్రికి రాత్రే గద్దె నిర్మిస్తే అధికారులు చట్టప్రకారం చర్యలు తీసుకుంటారు.. సిగ్గు లేకుండా శవరాజకీయాలు చేయడం సరైనది కాదు. నిబంధనల ప్రకారం చర్యలు తీసుకున్న అధికారులపై దౌర్జన్యాలు చేయడం, నర్సంపేటలో అనవసరంగా ఉద్రిక్తతలు సృష్టించడం సరైనది కాదు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టం తన పని తాను చేసుకుపోతుంది. ఆయన అన్నారు ఇప్పటికైనా వారి పద్ధతులు మార్చుకోవాలని పేర్కొన్నారు.

# కోయూరు పోలీస్ స్టేషన్ రికార్డులను పరిశీలించిన జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్

## పెండింగ్ కేసులను త్వరగా ముగించాలి

**మల్హర్,ఆగస్టు 11(జనంసాక్షి)** భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్,ఐపీఎస్ వార్షిక తనిఖీల్లో భాగంగా కోయూరు పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్‌కు చేరుకున్న ఎస్పీకి పోలీస్ సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం 'వన మహోత్సవం' లో భాగంగా స్టేషన్ ఆవరణలో ఎస్పీ గారు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది విధి నిర్వహణలను ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు. స్టేషన్‌లో నమోదైన పెండింగ్ కేసుల పురోగతిని సమీక్షించిన ఎస్పీ ,కేసుల దర్యాప్తును వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. దర్యాప్తు వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తూ రికార్డులను అప్‌డేట్ చేయాలన్నారు. రోడ్డు ప్రమాద కేసులకు సంబంధించిన వాహనాల స్థితిగతులు, వాటి పరిష్కార పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రౌడీ షీటర్లపై తీసుకుంటున్న చర్యలను సమీక్షిస్తూ, వారిపై నిరంతరం నిఘా కొనసాగించాలని ఆదేశించారు. రిసెప్షన్ విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడిన ఎస్పీ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. అందిన ఫిర్యాదులను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసి, నిబంధనల ప్రకారం తగిన చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ నిస్పాక్షికంగా, పారదర్శకంగా సేవలు అందించాలని, తద్వారా ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసాన్ని మరింత పెంపొందించడమే లక్ష్యంగా పనిచేయాలని పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, కాటారం సీఐ నాగార్జున రావు, కొయ్యూరు ఎస్సై మహేందర్ కుమార్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.




# మండల పార్టీ అధ్యక్షుడు పై మండిపడ్డ కాంగ్రెస్ శ్రేణులు

- పార్టీ కోసం పనిచేసిన వారికి గుర్తింపు లేదు
- కొత్తగా వచ్చిన వారికి ఎమ్మెల్యే బంధువులకే పార్టీ పదవులు ఇస్తారా

**ఆత్మకూర్, ఆగస్టు 11 (జనం సాక్షి):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరకాల నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించేందుకు వస్తున్న ప్రాంతం విజయవంతం చేయాలని మండల పార్టీ అధ్యక్షులు రేవూరి జలంధర్ రెడ్డి కోరుతున్న సమయంలోనే కాంగ్రెస్ నాయకులు ఆయనపై మండిపడ్డారు. మంగళవారం ఆత్మకూరు మండలం పోచమ్మ సెంటర్ వద్ద మండల పార్టీ అధ్యక్షులు రేవూరి జలంధర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి కక్కర్ల రాజు కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి సభను విజయవంతం చేయాలని మాట్లాడుతున్న క్రమంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పార్టీ కోసం పని చేసిన కార్యకర్తలకు గుర్తింపు ఇవ్వడం లేదని కేవలం తన బంధువులైన వారికే పార్టీ జెండా మోయని వారికి కూడా ఉన్నత పదవులు కట్టిపెడుతున్నారని మండిపడ్డారు. ప్రజలకు సౌకర్యం కోసం సిమెంట్ రోడ్లు వేస్తే బిల్లులు కూడా ఇప్పించడం లేదని కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పది సంవత్సరాలు పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు గుర్తింపు ఇవ్వకుండా కొత్తగా పార్టీల చేరిన వారికి పదవులు ఇవ్వడం ఎంతవరకు సమంజసం అని వారు ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రశ్నల వర్షం కురిపించడంతో సమాధానం చెప్పలేక మండల పార్టీ అధ్యక్షుడు నీళ్లు మింగారు. మేము ఎందుకు కార్యకర్తలను, ప్రజలను ముఖ్యమంత్రి సభకు తరలించాలి అంటూ నిలదీశారు.

# గురువారం వాహనాల బహిరంగ వేలం

## ఎక్సైజ్ సీఐ ఎన్.బిక్షపతి

**గూడూరు,ఆగస్టు11(జనంసాక్షి):** వివిధ కేసులలో సీజ్ చేయబడిన వాహనాలకు మహబూబాబాద్ జిల్లా ఎక్సైజ్ అధికారి కరంచంద్ సమక్షంలో గురువారం బహిరంగ వేలం వేయబడుతుందని గూడూరు ఎక్సైజ్ సీఐ ఎన్. బిక్షపతి అన్నారు. ఈ వాహనాలు వివిధ కేసులలో అనగా నల్ల బెల్లం,నాటు సారాయి,రవాణా కేసులలో పట్టుబడినటువంటి 17 ద్విచక్ర వాహనాలు ఉన్నాయని,. వేలంలో పాల్గొనదలచిన వారు స్వతహాగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ గూడూరు నందు ఉంచబడినటువంటి వాహనాలను చూసి, బహిరంగ వేలంలో పాల్గొనలని,వాహనాలకు వేలంలో పాల్గొనే వారు వాహనం ధరలో సగం రూపాయలను ఈఎండి గా, ఒక్కొక్క వాహనానికి విడివిడిగా గురువారం ఉదయం 10 గంటల లోపు చెల్లించి వేలంలో పాల్గొనలని తెలిపారు.

# మండల ఫోటో గ్రాఫర్ల సంఘం నూతన కమిటి ఎన్నిక

- అధ్యక్షుడిగా నరేష్
- ప్రధాన కార్యదర్శిగా ప్రదీప్

**పాలకుర్తి, ఆగస్టు 11(జనంసాక్షి)** పాలకుర్తి మండల ఫోటో గ్రాఫర్ల సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైంది. మంగళవారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరనలో మండల స్థాయి ఫోటో గ్రాఫర్ల సంఘం నూతన కార్యవర్గం సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా గౌరవాధ్యక్షుడుగా రాపోలు రాంబాబు, అధ్యక్షుడుగా గుడికందుల నరేష్, ఉపాధ్యక్షుడుగా వర్ధమాన్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా బొమ్మగాని ప్రదీఫ్, కోశాధికారిగా అక్కల రమణశ్రీ, కుటుంబ భరోసా కన్వీనర్ గా గజ్జి రాజు, కార్యవర్గ సభ్యులుగా శేఖర్, మధు, అశోక్, స్వామి, సతీష్ ఎన్నికయ్యారని గౌరవాధ్యక్షుడు రాంబాబు తెలిపారు.



# పేకాట స్థావరంపై సీసీఎస్ బృందం దాడి

- అదుపులో 9 మంది.. రూ.7,990ల నగదు స్వాధీనం



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి జిల్లా ఘనపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సీతారాంపూర్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న స్థావరంపై సీసీఎస్ బృందం మంగళవారం సాయంత్రం దాడి చేసింది. సమాచారం అందుకున్న సీసీఎస్ పోలీసులు సీతారాంపూర్ శివారులోని ఒకచోట పేకాట ఆడుతున్న వారిని గుర్తించి దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 7,990ల నగదు, రెండు ద్విచక్ర వాహనాలు, 9 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తులను, స్వాధీనం చేసుకున్న సామగ్రిని తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం ఘనపూర్ పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ఓకు అప్పగించారు. ఈ ఘటనలో మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పరారీలో ఉన్న వ్యక్తి కోసం గాలింపు చర్యలు చేపట్టామని పోలీసులు వెల్లడించారు.

## మహాత్మ జ్యోతిబాపూలే బాలిక పాఠశాలలో "హ్యూమన్ పాపిలోమా వ్యాక్సిన్"




**ఆత్మకూరు, ఆగస్టు 11 (జనం సాక్షి):** ఆత్మకూరు మండలంలోని మహాత్మా జ్యోతి బా పూలే పెద్దాపూర్ బాలికల పాఠశాలలో 14-15 సంవత్సరాల వయస్సు గల విద్యార్థునిలకు వ్యాక్సిన్ అనగా హ్యూమన్ పాపిలోమా వైరస్ ను సర్వైకల్ క్యాన్సర్ సోకకుండా ఉండడానికి ఈ వ్యాక్సిన్ ను అందించారు. ఇందులో భాగంగా ఆత్మకూరు పీ హెచ్ సి బృందం మెడికల్ ఆఫీసర్ డా.స్పందన, సిహెచ్ఓ జూనెడీ, హెల్త్ సూపర్ వైజర్ రమేష్, హెల్త్ అసిస్టెంట్ అనిల్, స్టాఫ్ నర్స్ అశ్వినీ, ఏఎన్ఎం ఎల్లమ్మ, పాఠశాల హెల్త్ సూపర్ వైజర్ ఎండీ . అస్మా పాల్గొన్నారు.

## మైలారానికి ప్రత్యేక విద్యుత్ లైన్

- 24 గంటల విద్యుత్ సరఫరా లక్ష్యం
- ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి



**రాయపర్తి,ఆగస్టు 11(జనంసాక్షి):** మైలారం గ్రామ ప్రజల విద్యుత్ సమస్యకు పరిష్కారం లభించింది.గ్రామానికి 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు రూ.9 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ప్రత్యేక విద్యుత్ లైన్‌ను పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి మంగళవారం విద్యుత్ శాఖ అధికారులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ ప్రజల అవసరాలను గుర్తించి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు.మైలారం గ్రామానికి ప్రత్యేక విద్యుత్ లైన్ ఏర్పాటు చేయడం ద్వారా 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరాకు మార్గం సుగమమైందని పేర్కొన్నారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరా అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.మైలారం గ్రామ అభివృద్ధికి అవసరమైన మరిన్ని మౌలిక వసతులను దశలవారీగా కల్పించేందుకు కృషి చేస్తామని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి,స్థానిక సర్పంచ్ చిర్రా వేణు, విద్యుత్ శాఖ అధికారులు,మండల ముఖ్య నాయకులు స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## లాడ్జిలను తనిఖీ చేసిన పోలీసులు




**కాళేశ్వరం , ఆగస్టు 11 , ( జనం సాక్షి).** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం గ్రామంలో క్యాషియో ప్రోగ్రాంలో భాగంగా మంగళవారం గ్రామంలోని లాడ్జీలను మహదేవపూర్ సిఐ వెంకటేశ్వర్లు , కాళేశ్వరం ఎస్సై జీ తమాషా రెడ్డి తనిఖీ చేసి అనంతరం లాడ్జి ఓనర్లతో పోలీస్ స్టేషన్ నందు సమావేశం నిర్వహించారు. లాడ్జి నిర్వహణకు సంబంధించిన అనుమతి పత్రాలు కచ్చితంగా తీసుకోవాలని , అన్ని అనుమతులు తో లాడ్జీలు నడుపుకోవాలని ఈ సందర్భంగా పోలీసులు వారికి సూచించారు.అలాగే రూములు ఇచ్చేముందు గుర్తింపు పత్రాలు తీసుకోవాలని , పెళ్ళిళ్ళు కాని జంటలకు రూములు ఇవ్వవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో మహాదేవపూర్ సిఐ ఎన్ వెంకటేశ్వర్లు , కాళేశ్వరం ఎస్సై జి తమాషారెడ్డి, రెండవ ఎస్ఐ కే భగవత్, మహాదేవపూర్ ఎస్సై సాంబమూర్తి ,పలిమల ఎస్సై సాయి శశాంక్ మరియు సివిల్ సిబ్బంది, టీజీఎస్పీ సిబ్బంది పాల్గొన్నారు.

## దళిత క్రైస్తవులపై బీజేపీ ప్రభుత్వం వివక్ష చూపుతోంది



**స్టేషన్ ఘన్‌పూర్, ఆగస్టు 11 ( జనం సాక్షి ) :** దేశంలో దళిత క్రైస్తవులపై బీజేపీ ప్రభుత్వం వివక్ష చూపుతోందని తెలంగాణ రాష్ట్ర తొలి ఉపముఖ్యమంత్రి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటి కొండ రాజయ్య ఆరోపించారు.స్టేషన్ ఘనాపూర్ నియోజకవర్గకేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాల యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో తెలంగాణ తొలి ఉపముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ స్టేషన్ ఘనాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తాటికొండ రాజయ్య పలు కీలక అంశాలపై మాట్లాడారు. హిందూ మతంలో ఉంటేనే దళితు లకు ఎస్సీ హోదా కల్పించే విధానం కొనసాగడం వివక్ష కాదా అని ప్రశ్నించారు. ఈ విషయంలో ఇతరులకు ఉన్న వెసులుబాటు దళిత క్రైస్తవుల కు ఎందుకు ఉండకూడదని ప్రశ్నించారు. బీసీ వర్గానికి చెందిన వ్యక్తి క్రైస్తవ మతంలోకి మారినా వారి కుల గుర్తింపు మారకుండా ఉండే పరిస్థితి ఉంటే, కేవలం దళితుల విషయంలోనే ఈ వివక్ష ఎందుకు అని నిలదీశారు. జనగణన ప్రక్రియ ప్రారంభం కాకముందే పార్లమెంట్‌లో బిల్లు పెట్టి దళిత క్రైస్తవుల సమస్యకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ మాదిగలకు టికెట్లు ఇవ్వకుండా వివక్ష చూపుతోందని విమర్శించారు. మందుల శామ్యూల్ వంటి ఎమ్మెల్యేలు కూడా వివక్షను ఎదుర్కొంటున్నారని అన్నారు.ఎంపీ సీట్ల కేటాయింపులో కూడా రేవంత్ రెడ్డి మాదిగ లపై వివక్ష చూపించారని ఆరోపించారు. హైడ్రా పేరుతో హైదరాబాద్‌లో విధ్వంసం సృష్టిస్తున్నారని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై కూడా గౌరవం లేకుండా రేవంత్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. బీఆర్ ఎస్ దివంగత నేత పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహ ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డంకులు సృష్టిం చకుండా సహకరించాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టిస్తున్నారని కడియం శ్రీహరిపై ఆరోపణలు చేశారు. పార్టీ మారితేనే పనులు చేస్తాం అంటూ బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించా రు.1,400 కోట్ల అభివృద్ధి అంటూ ఫ్లెక్సీలు పెట్టు కునే కడియం శ్రీహరి, ఆ అభివృద్ధి పనులు ఎక్క డ జరిగాయో ప్రజలకు చూపించాలని ప్రశ్నించా రు. మున్సిపాలిటీ కమిషనర్ ఫ్లెక్సీలకు ఇచ్చిన అనుమతులను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. పెద్ది సుదర్శన్ రెడ్డి ఆనాడు జిల్లా నాయ కుడిగా ఉన్నప్పుడు అందరినీసమన్వయం చేస్తూ పార్టీని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిం చారని గుర్తు చేశారు. అలాంటి నాయకుడు మన మధ్య లేకపోవడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహఏర్పాటు కు కాంగ్రెస్ ప్రభుత్వం సహకరించాలని డాక్టర్ రాజయ్య కోరారు. ముందుగా రెడ్డి సుదర్శన్ రెడ్డి కి సంతాపం తెలియజేస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మాచర్ల గణేష్ గౌడ్, కనకం గణేష్, తాటికొండ సురేష్,బంగ్లా శ్రీనివాస్, మారపెల్లి ప్రసాద్,గట్టు క్రిష్ణ సాయి,బత్తుల రాజన్ బాబు,కుంభం కుమార్,ఊరడి లింగం,చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## పప్పు దినుసు పంటలను రైతులు సాగు చేసేలా ప్రోత్సహించాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- వ్యవసాయ శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షా



**హనుమకొండ ప్రతినిధి ఆగష్టు 11. (జనం సాక్షి) :** ప్రస్తుత ఎల్నినో పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటలలో భాగంగా పప్పు దినుసుల పంటలను అధిక విస్తీర్ణంలో సాగు చేసే విధంగా రైతులను ప్రోత్సహించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆత్మ నిర్భరత ఇన్ పల్సెస్ ( పప్పు దినుసుల సాగులో స్వయం సమృద్ధి సాధించడం)పై వ్యవసాయ శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లాలోని ఆయా మండలాల్లో ప్రత్యామ్నాయ పంటల సాగు గురించిన వివరాలను మండల వ్యవసాయ అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రైతు బీమా క్లెయిమ్‌ల వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ ఎరువుల దుకాణాలలో ఎరువులు విత్తనాల నాణ్యత ప్రమాణాలను పాటించే విధంగా విస్తృత తనిఖీలు నిర్వహించాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. రైతు బీమా క్లెయిమ్ లను త్వరితగతిన చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. రైతు నమోదు( ఫార్మర్ రిజిస్ట్రీ) అందరూ రైతులు నమోదు చేసుకునే విధంగా విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 87.8 శాతం నమోదు పూర్తయిందని, మిగతా నమోదును త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర, సహాయ సంచాలకులు ఆదిరెడ్డి, అవినాష్ వర్మ, సాంకేతిక వ్యవసాయ అధికారి కమలాకర్, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

## దుబ్యాల గ్రామంలో పరిశుభ్రత పరిరక్షణలో భాగంగా దోమల నివారణకు దోమల మందు పిచికారీ చేయించిన సర్పంచ్ సంఘీ అంజలి



**టేకుమట్ల ఆగస్టు 11 జనంసాక్షి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా, టేకుమట్ల మండలం దుబ్యాల గ్రామంలో వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా గ్రామ సర్పంచ్ సంగీ అంజలి ఆధ్వర్యంలో మంగళవారం పంచాయతీ సిబ్బందితో కలిసి ప్రత్యేకంగా దోమల నివారణ మందు పిచికారీ చేపించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సంగీ అంజలి మాట్లాడుతూ... వర్షాల వల్ల నీరు నిల్వ ఉండి దోమలు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని, అందుకే ముందుస్తు జాగ్రత్త చర్యగా గ్రామంలోని అన్ని వీధులు, మురికి కాలువలు, రద్దీ ప్రాంతాల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయించినట్లు తెలిపారు. గ్రామ ప్రజలు కూడా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇళ్ల ముందు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని ఆమె సూచించారు. డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

# చెన్నూరు, పాలకుర్తి రిజర్వాయర్ పనులు త్వరగా పూర్తి చేయాలి

### ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**పాలకుర్తి, ఆగస్టు 11 (జనంసాక్షి)** హనుమకొండ చింతగట్టులోని సి ఈ వరంగల్ ఇరిగేషన్ కార్యాలయంలో జే.చొక్కారావు దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ (జె సి ఆర్-డి ఎల్ ఐ ఎస్) పై ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యే లతో ఈఎన్సి ఓ.వి. రమేష్ బాబు ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సహచర ఎమ్మెల్యేలతో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పాల్గొని పాలకుర్తి నియోజక వర్గానికి సంబంధించిన సాగునీటి సమస్యలు, దేవాదుల ప్రాజెక్టు పనుల పురోగతి, పెండింగ్‌లో ఉన్న పనులపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ పాలకుర్తి నియోజకవర్గానికి ఎంతో కీలకమైన పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను కోరారు. రిజర్వాయర్ పనులు పూర్తయితే నియోజకవర్గంలోని రైతులకు సాగునీటి వసతి మరింత మెరుగుపడి, వ్యవసాయ రంగానికి ఎంతో మేలు జరుగుతుం దని తెలిపారు. అదేవిధంగా దేవరుప్పుల మండలం ధర్మగడ్డ తండా సమీపంలో కాలువ క్లియరెన్స్ లేకపోవడంతో రైతులకు సాగునీరు అందడం లేదని ఎమ్మెల్యే అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే సంబంధిత ప్రాంతాన్ని పరిశీలించి కాలువలో ఉన్న అడ్డంకులను తొలగించి, రైతులకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే పాలకుర్తి నియోజకవర్గంలోని దేవాదుల కాలువలు, డిస్ట్రిబ్యూటరీలు, ఆయకట్టు ప్రాంతాల్లో నీటి సరఫరాకు సంబంధించిన సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న పనులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఎమ్మెల్యే లేవనెత్తిన సమస్యలపై స్పందించిన ఈ ఎన్ సి ఓ.వి. రమేష్ బాబు, సంబంధిత ఇరిగేషన్ అధికారులకు తక్షణమే క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధర్మగడ్డ తండా సమీపంలోని కాలువ సమస్యను పరిశీలించి క్లియరెన్స్ పనులను త్వరగా పూర్తి చేసి రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్ పనుల పురోగతిని వేగవంతం చేసి, పెండింగ్‌లో ఉన్న అంశాలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత పనులను సమన్వయంతో ముందుకు తీసుకెళ్తామని వెల్లడించారు. పాలకుర్తి నియోజకవర్గంలో సాగునీటి వనరుల అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు.

# అసత్య కథనాలతో ప్రజల్లో భయాందోళనలు సరికాదు

### వారం రోజుల్లో 20 ఆస్తి నేరాల ఛేదన.. జిల్లా ఎస్పీ. జానకి షర్మిల



**నిర్మల్ బ్యూరో, ఆగస్టు 11: (జనంసాక్షి)** దొంగతనాలను కొండంతలుగా చూపిస్తూ ప్రజల్లో భయాందోళనలు కలిగించేలా అసత్య కథనాలు ప్రచురించడం సరికాదని నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల అన్నారు. వాస్తవ ఆధారాలతో చేసే విమర్శలను స్వాగతిస్తామని, అయితే నిరాధార ఆరోపణలు, వాస్తవాలను వక్రీకరించే కథనాలతో పోలీసుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయడం తగదన్నారు. జిల్లాలో ఆస్తి నేరాల నియంత్రణకు రెండు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. సీసీ కెమెరాలు, సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టి వారం రోజుల్లో 20 ఆస్తి నేరాల కేసులను ఛేదించడంతో పాటు మరో 15 కేసుల్లో కీలక ఆధారాలు సేకరించినట్లు వెల్లడించారు. భైంసా, నిర్మల్, నిర్మల్ రూరల్, మామడ, సారంగాపూర్, లక్ష్మణచాంద, తానూర్, కడెం ప్రాంతాల్లో జరిగిన ఇంటి, ఆలయ, ద్విచక్ర వాహన, కాపర్ వైర్ చోరీ కేసులపై దర్యాప్తు కొనసాగుతోందన్నారు. భైంసాలో 5, నిర్మల్‌లో 7, సారంగాపూర్‌లో ఒకటి చొప్పున మొత్తం 13 ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి విస్తృతంగా వాహన తనిఖీలు, నిఘా కొనసాగిస్తున్నట్లు చెప్పారు. నేరాలు జరగకుండా ముందస్తు చర్యలకు ప్రాధాన్యం ఇస్తున్నామని, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై నిఘా పెంచామని ఎస్పీ తెలిపారు. ఆలయాలు, వ్యాపార సంస్థలు, ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. పోలీస్ శాఖపై అసత్య, నిరాధార కథనాలు కొనసాగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# కేసుల పరిష్కారంలో రాజీ, మధ్యవర్తిత్వం ఉత్తమమైనది

### చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పుప్పాల శ్రీనివాస్

**టేకుమట్ల ఆగస్టు 11 జనంసాక్షి** టేకుమట్ల మండలంలోని సోమనపల్లి కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్ లో జరిగిన న్యాయ అవగాహనా సదస్సు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మొబైల్ వ్యాన్ ఉపయోగించి టేకుమట్ల మండలం సోమనపల్లి గ్రామ కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్ లో న్యాయ అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీ పుప్పాల శ్రీనివాస్ మాట్లాడుతూ సమస్యలు తలెత్తినప్పుడు, ఇదివరకే నమోదైన కేసుల్లో రాజీ, మధ్యవర్తిత్వం ఉత్తమమైనది అని తెలిపారు. డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కే. అక్షయ, సూపరింటెండెంట్ రఘురామ్ లు మాట్లాడుతూ మీడియేషన్ సెంటర్ సేవలను వినియోగించుకోవాలన్నారు. అనంతరం అంకుశపురం, టేకుమట్ల, చిట్యాల గ్రామాల్లో న్యాయ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై అమూల్య, అంకుశపురం సర్పంచ్




తోటసునీతసాగర్, స్థానిక నాయకులు పోతనవేణి ఐలయ్య, బొల్లపెల్లి శ్రీనివాస్, థౌటం నవీన్, మారాపెల్లి మల్లేష్, ఎలుకటి రాజయ్య, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది దేవేందర్, కే. మహిత, రమ్య, అలేఖ్య, కే. వెంకటేష్, ఎమ్. రాజ్ కుమార్, గౌతమి, మీడియేటర్ అంబాల ఆనందం, పారా లీగల్ వాలంటీర్స్ అంబాల రమేష్, అరెపెల్లి తిరుపతి,బండారి రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# సెన్సస్ హ్యాండ్ బుక్ రూపకల్పనకు తగిన సమాచారం అందించాలి

### జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్ బ్యూరో ఆగస్టు 11,(జనంసాక్షి)** జిల్లా సెన్సస్ హ్యాండ్ బుక్ రూపకల్పనకు శాఖల వారిగా సంబంధిత సమాచారం అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం సాయంత్రం జిల్లా సెన్సస్ హ్యాండ్ బుక్ రూపకల్పనకు సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సమావేశం నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని జనాభా, అక్షరాస్యత, భౌగోళిక పరిస్థితులు, విద్య, వైద్యం, మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, వివిధ ప్రభుత్వ శాఖల వారీగా లభ్యమయ్యే సమాచారాన్ని అత్యంత ఖచ్చితత్వంతో సేకరించాలని చెప్పారు. భవిష్యత్తులో జిల్లా సమగ్ర అభివృద్ధికి, ప్రభుత్వ సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలుకు, భౌగోళిక, సంస్కృతిక అంశాల్లో అభివృద్ధికి ఈ సెన్సస్ హ్యాండ్ బుక్ ప్రామాణికంగా ఉపయోగపడుతుందని అన్నారు. ప్రణాళిక, రెవెన్యూ, పంచాయతీ రాజ్, విద్య, వైద్యారోగ్య, తదితర శాఖల అధికారులు సమన్వయంతో నిర్ణీత గడువులోగా నివేదికలను సమర్పించాలని ఆదేశించారు. వివరాల సేకరణలో ఎలాంటి తప్పులకు తావు ఉండకూడదు అన్నారు. సేకరించిన సమాచారాన్ని క్షేత్రస్థాయిలో పునఃపరిశీలించిన తర్వాతే నివేదికలో పొందుపరచాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, సిపివో గంగారెడ్డి, ఆర్డీవో దేవీదాస్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# నేడు స్వర్గీయ మలహార్‌రావు జయంతి



**మల్హర్ ,ఆగస్టు11(జనంసాక్షి)** మండలంలోని కొయ్యూరు సెంటర్‌లో బుధవారం ఉదయం గంటలకు మాజీ ఎంపీపీ, స్వర్గీయ బెల్లంకొండ మలహార్‌రావు 76వ జయంతి వేడుకలను బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంథని బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్, విశిష్ట అతిథిగా మాజీ జడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి రాకేష్ హాజరుకానున్నట్లు మాజీ జెడ్పిటిసి గోనే శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మలహార్‌రావు అభిమానులు, బంధుమిత్రులు అధిక సంఖ్యలో తరలివచ్చి నివాళులర్పించాలని మాజీ జడ్పీటీసీ గోనె పద్మ శ్రీనివాస్‌రావు పిలుపునిచ్చారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు

### జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పనితీరు మెరుగుపరచాలని డి ఎం ఎచ్ ఓ ఆదేశాలు



**వరంగల్ ఎంజీఎం, ఆగస్టు 11(జనంసాక్షి):** వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. బి. రాజా రెడ్డి , డిప్యూటీ డి ఎం ఎచ్ ఓ డా. ఐ. ప్రకాష్ తో కలిసి ఈరోజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దుగ్గొండి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నల్లబెల్లి మరియు బానోజిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా ఆరోగ్య కేంద్రాల్లో అందిస్తున్న వైద్య సేవలను, ఫార్మసీ సేవలను పరిశీలించి, వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన రికార్డులను, రిజిస్టర్లను మరియు కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. సిబ్బంది పనితీరు, ప్రజలకు అందుతున్న ఆరోగ్య సేవలు తదితర అంశాలను పరిశీలించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలన్నింటిలో మెరుగైన పనితీరు సాధించాలని, లక్ష్యాలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని డి ఎం ఎచ్ ఓ సూచించారు. రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహిస్తూ, ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలని వైద్యాధికారులు మరియు సిబ్బందికి ఆదేశించారు. ఈ కాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. డ్రై డే యాక్టివిటి లను నిర్వహించాలి అని అన్నారు. అత్యవసర మందులను అన్ని కేంద్రాలలో నిల్వ ఉంచుకోవాలి అని అన్నారు. అలాగే ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, అందుబాటులో ఉన్న మానవ వనరులు మరియు సౌకర్యాలను సమర్థవంతంగా వినియోగించుకుని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యం లేకుండా సమన్వయంతో పనిచేయాలని,సమయ పాలన పాటించాలి అని డా. బి. రాజా రెడ్డి తెలిపారు.

# ప్రతి ఇంటా జాతీయ జెండా ఎగరాలి



**వేమనపల్లి, ఆగస్టు 11 (జనం సాక్షి )** హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసేలా ప్రజల్లో జాతీయ స్ఫూర్తి, దేశభక్తిని పెంపొందించాలని బీజేపీ ఎస్టీ మోర్చా మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు అడే ప్రేమ్‌సింగ్ పిలుపునిచ్చారు. బీజేపీ వేమనపల్లి మండల అధ్యక్షుడు ఏట రవికుమార్ ఆధ్వర్యంలో తిరంగా యాత్ర కార్యక్రమం విజయవంతం చేసేందుకు మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రేమ్‌సింగ్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి గ్రామంలోని ప్రతి ఇంటికీ జాతీయ జెండాను చేరవేయాలని సూచించారు. హర్ ఘర్ తిరంగా ద్వారా ప్రజలతో మరింత సన్నిహితంగా మమేకమై, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని అన్నారు. పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఏట రవికుమార్, ప్రధాన కార్యదర్శి ఏనుముల వెంకటేష్, మహిళా మోర్చా అధ్యక్షురాలు ముదిమడుగుల లావణ్య, ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడు కుర్మ లస్మయ్య, ఉపాధ్యక్షుడు ముల్కాలా సత్యనారాయణ, బూత్ అధ్యక్షులు కోటారి సతీష్, చీడెం శ్రీకాంత్, నాయకులు కొరకుప్పుల విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. జాతీయ జెండా ప్రతి ఇంటా ఎగరాలి -- దేశభక్తి ప్రతి గుండెలో నిండాలి" అని నాయకులు పిలుపునిచ్చారు.

# గుడిసెలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే నా లక్ష్యం

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో రాష్ట్ర స్థాయిలో 2వ స్థానంలో ఉమ్మడి జిల్లాలో మొదటి స్థానంలో నిలిచామని, ఎస్ ఐ ఆర్ లో కృషి చేసిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. గుడిసెలలో ఉంటున్న వారికి మొదటి ప్రాధాన్యతగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేయ డం జరుగుతుందని, ప్రతీ గ్రామంలో గుడిసెలలో ఉంటున్న వారిని గుర్తించి వారి వివరాలు ఇవ్వా లని అన్నారు. నియోజకవర్గంలోని 291 బూత్ లకు ఒక్కో బూత్ కు 10ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని, 10రోజులలో అర్హులైన లబ్ధిదారుల జాబితా సర్పంచులు, అధ్యక్షులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు అందజేయాలని అన్నారు. ఆగస్టు15నుండి డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ చేయడం జరుగుతుందని, రాష్ట్ర వ్యాప్తం గా కోటి 05లక్షల కుటుంబాలకు డిజిటల్ రేషన్ కార్డులు అందుతాయని,ప్రతీ గ్రామంలో సర్పంచ్ చేతుల మీదుగా డిజిటల్ రేషన్ కార్డులు పంపిణీ చేయాలని అన్నారు. పార్టీ సంస్థాగత నిర్మాణం బలంగాఉంటేనే పార్టీ బలంగా ఉంటుందని పార్టీ కోసం పని చేసే వారినే గ్రామ అధ్యక్షులుగా ఎన్ను కోవాలని గ్రామస్తుల ఏకాభిప్రాయంతోనే అధ్యక్షు ల ఎన్నిక జరగాలని అన్నారు. ఏకాభిప్రాయం రాని చోట రెండు లేదా మూడు పేర్లను జిల్లా కమిటీకి సిఫార్సు చేయాలని తెలిపారు. దేశంలో బీజేపీపై వ్యతిరేకత, కాంగ్రెస్ పై అనుకూలత పెరిగిందని, ప్రజలు, యువత కాంగ్రెస్ పార్టీ వైపు, రాహుల్ గాంధీ వైపే చేస్తున్నారని,బీజేపీ మళ్ళీ అధికారంలోకి వస్తే బలహీన వర్గాలు, షెడ్యూల్ కులాలు, మైనారిటీ వర్గాల బ్రతుకులు నాశనం అవుతాయని అన్నారు. నాలుగో సారి మోడీ ప్రధాని అవుతాడని బీజేపీ కలలు కంటుందని, కానీ దేశ యువత, ప్రజలు కాంగ్రెస్ పార్టీ వైపు, రాహుల్ గాంధీ వైపు చూస్తున్నారని,దేశంలో ప్రజా స్వామ్యం పరిరక్షించాలి అంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలి, రాహుల్ గాంధీ ప్రధాని కావాలని అన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళాలని అన్నారు. దాదాపు 1600కోట్లతో నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని అన్నారు.అవినీతి సొమ్ముతో సోషల్ మీడియాలో అసత్య ప్రచారా లు చేస్తున్నాయనిమన నాయకులపై వచ్చే తప్పు డు ప్రచారాలను వెంటనే తిప్పికొట్టాలని అన్నారు. ఎవరైనా మన వైపుగాని, మన పార్టీ వైపుగాని చూడాలంటే భయపడాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ ఐ ఆర్ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి, స్టేషన్ ఘనపూర్ మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూలుకుంట్ల లావణ్య శశిరీష్ రెడ్డి, చిల్పూర్ దేవస్థాన చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, ఎస్ ఐ ఆర్ నియోజకవర్గ ఇంచార్జ్ లింగాల జగదీష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రఘునాథ్ పెల్లి మండల అధ్యక్షుడు గాదె మహేందర్ రెడ్డి, స్టేషన్ స్టేషన్ ఘన్పూర్ మండల అధ్యక్షుడు జూలుకుం ట్ల శిరీష్ రెడ్డిని, పట్టణ అధ్యక్షుడు అంబటి కిషన్ రాజును, చిల్పూర్ మండల అధ్యక్షుడు చిర్ర నాగరాజు, జాఫర్గఢ్ మండలాధ్యక్షుడు నూకల ఐలయ్య, ధర్మసాగర్ మండల అధ్యక్షుడు పెసరు రమేష్, వేలేరు మండల అధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్,బెలిదే వెంకన్న, గుడి వంశీధర్ రెడ్డి, కోళ్ల రవి గౌడ్, బొమ్మిశెట్టి బాలరాజు, గద్దమీది సురేష్ కుమార్,రజాక్,బేతి జయపాల్ రెడ్డి, నాగరబోయి న శ్రీరాములు, తెల్లాకుల రామకృష్ణ, కొలిపాక సతీష్,గుగులో త్ ఉమ్లా నాయక్, ప్రభాకర్, వెంకటయ్య, 7 మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు తదితరులుపాల్గొన్నారు.

# రాజీవ్ యువ వికాసం అందని ద్రాక్షేనా?

ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడంతో అభ్యర్థులు అయోమయంలో పడ్డారు. యూనిట్ ఆధారంగా రూ.50 వేలు, రూ.1 లక్ష, రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు రుణాలు ఇవ్వనున్నట్లు ప్రభుత్వం గతంలో ప్రకటించిన విషయం తెలిసిందే. రూ.50 వేల విలువైన యూనిట్‌కు 100 శాతం రాయితీ, రూ.1 లక్షకు పైగా ఉన్న వాటికి బ్యాంకు లింకేజీ, యూనిట్ విలువ ఆధారంగా రాయితీ ఇస్తామని పేర్కొంది. మహిళలకు 25 శాతం, దివ్యాంగులకు 5 శాతం యూనిట్లు కేటాయించాలని జీవో సైతం విడుదల చేసింది. అయినప్పటికీ ఒక్క యూనిట్‌ను కూడా మంజూరు చేయకపోవడంతో వెంకటాపూర్ మండల నిరుద్యోగ యువత లో నిరాశ వ్యక్తమవుతోంది.ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు లబ్ధిదారుల ఎంపిక జాబితాను విడుదల చేసి నిరుద్యోగ యువతకు అండగా నిలవాలని వెంకటాపూర్ మండల పరిధిలో ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## చేనులోనే కూరగాయల షెడ్డు..

వంటి యువ రైతులు తక్కువ భూమిలోనూ లాభాలు పొందవచ్చని నిరూపిస్తున్నారని స్థానికులు అంటున్నారు. పత్తి, మిర్చి వంటి పంటలపైనే ఆధారపడకుండా కూరగాయలు, ఆకుకూరల సాగు చేస్తే మహిళలకు కూడా ఉపాధి దొరుకుతుందని, గ్రామాల్లో కూరగాయల లభ్యత పెరిగి వినియోగదారులకు మేలు జరుగుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. నష్టాల్లో కూరుకుపోతున్న వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవడానికి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాల్సిన అవసరాన్ని ఈ యువ దంపతుల కథ మరోసారి గుర్తు చేస్తోంది.

**కూరగాయలతోనే జీవనాధారం : రైతు భాస్కర సంపత్..**



కూరగాయల సాగే నాకు జీవనాధారం. ఎకరం భూమి కౌలుకు తీసుకుని కూరగాయలు పండిస్తున్నాను. ఓవైపు కూరగాయలు పంటను సాగు చేస్తూనే, మరోవైపు వంట చేను పక్కనే షెడ్డు వేసి కూరగాయలను వికరిస్తున్నాను. చుట్టుపక్కల గ్రామాల నుండి ప్రజలు, బాటసారులు ఇక్కడికి వచ్చి కూరగాయలు కొనుగోలు చేస్తున్నారు. తనకు ఆదాయం కలిసి వస్తుంది. దాంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాను.



## చెన్నూరులో విస్తృత స్థాయిలో పోలీసుల తనిఖీలు

**చెన్నూర్ ఆగస్టు 11 (జనం సాక్షి) :** చెన్నూర్ లో నాటుసారా, గంజాయి, డ్రగ్స్ లాంటి మత్తుపదార్థాల నియంత్రణ లో భాగంగా మంగళవారం స్థానిక పోలీసులు పట్టణంలోని పలు ప్రాంతాల్లో నార్కోటిక్ డాగ్స్ విస్తృత తనిఖీలు చేపట్టారు. 63వ జాతీయ రహదారి పరిసర ప్రాంతాలలోని అనుమానిత హోటల్స్, పాన్ షాపుల్లో తనిఖీ లు నిర్వహించారు. యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందని ఎస్సై రాజశేఖర్ ఈ సందర్భంగా అన్నారు

## కత్తి వెంకట స్వామి కుటుంబాన్ని పరామర్శించిన గోపా నాయకులు

**నర్సంపేట ఆగస్టు 11 ( జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుడు, ప్రొఫెసర్ డాక్టర్ కత్తి వెంకటస్వామి గౌడ్ .సతీమణి భవాని. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి యొక్క దశదిన కార్యక్రమం ను శ్రీ మహా రాణా ప్రతాప్ ఫంక్షన్ హాల్ అంబర్ పేట హైదరాబాద్ నందు నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గోపా అధ్యక్షులు బండి సాయన్న గౌడ్. రాష్ట్ర గోపా ఆర్గనైజేషన్ కార్యదర్శి ఏలమకట్టి మీరయ్య గౌడ్. వరంగల్ జిల్లా గోపా అసోసియేషన్ అధ్యక్షులు రామగోని సుధాకర్ గౌడ్. పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం వారి యొక్క కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పల్లె లక్ష్మణ్ రావ్ గౌడ్ , గౌడ సంఘం నాయకులు మొగుల్ల అశోక్ కుమార్ గౌడ్ , పల్లె రామచందర్ గౌడ్ , నర్సంపేట గౌడ సంఘం మాజీ అధ్యక్షులు గిరగాని సాంబయ్య గౌడ్ , నాసగోని రాజయ్య గౌడ్ , గోపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబానికి ఆర్థికసాయం

**శ్రీ రామకృష్ణ సేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో 5 వేల ఆర్థిక సాయం**



**మంగపేట, ఆగస్టు 11 (జనంసాక్షి)** మండలంలోని పూరే దుపల్లి గ్రామానికి చెందిన కొదారి శారద ఇటీవల అనారోగ్యం సమస్యతో మృత్యువాతకు గురైంది. ఈ విషయాన్ని స్థానికుల ద్వారా తెలుసుకున్న శ్రీ రామకృష్ణ సేవ ట్రస్ట్ చైర్మన్, బిఆర్ఎస్ జిల్లా యూత్ నాయకుడు బాడిషా నాగ రమేష్ ఆ కుటుంబానికి ఆర్థిక చేయూతను అందించారు. మంగళవారం ఆయన మృతురాలి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి మృతురాలి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం ఆ కుటుంబానికి తమవంతుగా 5వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కొప్పుల మాణిక్యం, అయూబ్, సంపత్ రెడ్డి, ఈర్ల గోపాల్, కొమరం వెంకటేశ్వర్లు, సింగ రాము, రాజకుమార్, ఎస్కే రహిమత్, జగన్, ఎస్కే అఫ్రోజ్, ఎండి నజ్జు, బాడిశ నవీన్, కొమరం పుల్లారావు, మునిగెలా మహేష్, మండల సంతోష్, నిట్టా బన్ను, ఇందారపు రమేష్, మంచెర్ల వంశీ, సోషల్ మీడియా వారియర్ మునిగేల నరేష్ పాల్గొన్నారు.

# మొక్కలు నాటిన నాయిని నీలిమా రాజేందర్ రెడ్డి



**కాజీపేట ఆగస్టు:11(జనం సాక్షి) :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 59వ డివిజన్ ఇంద్రానగర్‌లో ఇంద్రానగర్ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆదేశాల మేరకు ఎమ్మెల్యే సతీమణి శ్రీమతి నాయిని నీలిమా రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా నాయిని నీలిమా రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ..., పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. పచ్చదనం పెంపొందించడం ద్వారా కాలనీల్లో ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించవచ్చని పేర్కొన్నారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటి సంరక్షణపై కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కాలనీ వాసులకు సూచించారు. ప్రజల భాగస్వామ్యంతో వరంగల్ నగరాన్ని మరింత పచ్చగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 59వ డివిజన్ ఇంచార్జ్ కేతిడి దీపక్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ వసంత్ మహేందర్ రెడ్డి, కాలనీ అధ్యక్షులు, కార్యదర్శి జనార్ధన్ రెడ్డి, తెల్ల సుగుణ కిషోర్, శ్రీనివాస్ రావు, నేహాల్‌తో పాటు కాలనీ వాసులు పాల్గొన్నారు.

# కామన్ ఇంట్రెస్ట్ గ్రూప్ ల ఏర్పాటు పై ప్రత్యేక దృష్టి సారించండి

**వరంగల్ ఎంజీఎం, ఆగస్టు 11(జనంసాక్షి):** స్ట్రీట్ వెండర్ లతో కూడిన కామన్ ఇంట్రెస్ట్ గ్రూప్ (సి ఐ జీ)ల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని బల్దియా అదనపు కమిషనర్ జోనా అభిప్రాయపడ్డారు.మంగళ వారం బల్దియా ప్రధాన కార్యాలయం లోని కౌన్సిల్ హాల్ లో వరంగల్ బ్లాక్ కు చెందిన బ్యాంకర్ లు, కమ్యూనిటీ ఆర్గనైజర్ లతో ఏర్పాటు చేసిన జాయింట్ మండల్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ మీటింగ్ (జే ఎం ఎల్ బి సి)లో లీడ్ బ్యాంక్ మేనేజర్ జీవన్ కుమార్ తో కలిసి అదనపు కమిషనర్ పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ పి ఎం స్వానిధి లో భాగం గా నగరం ముందంజలో ఉందని ఇందులో భాగం గా స్ట్రీట్ వెండర్లకు మూడు స్థాయి లలో లోన్ లను అందజే స్తున్నామని, వీధి వ్యాపారులను ఎస్ హెచ్ జీ ల తరహా లో కామన్ ఇంట్రెస్ట్ గ్రూప్ (సి ఐ జీ) లుగా తీర్చిదిద్ది వారికి రుణాలను అందజేయాలని, అలాగే శానిటేషన్ కు చెందిన మహిళలను దీనదయాళ్ అంత్యోద య యోజన షెహరీ పథకం లో భాగం గా గ్రూప్ లుగా తయారు చేసి వారికి ఆర్థిక చేయూత అందించడానికి, బ్యాంకు ఖాతాలు అందించడం లో బ్యాంకర్ లు వారికి సహకరించాలని, కొత్త మహిళా సంఘాల గ్రూప్ లు పెద్ద సంఖ్యలో తయారు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు.

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణపై సమీక్ష.



**శ్రీరాంపూర్ (జనంసాక్షి):** ఏరియా సింగరేణి జీఎం శ్రీనివాస్ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణపై అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు.స్వాతంత్ర్యం సిద్ధించి 80 వ వసంతాలు పూర్తవుతున్న సందర్భంగా ఏరియాలో ఈసారి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలన్నారు.వివిధ విభాగాల అధిపతులకు ఏర్పాట్లపై సూచనలు చేశారు.షెడ్యూల్ ప్రకారం జెండా వందనం,ఉత్తమ ఉద్యోగులు,ప్రతిభావంతులైన విద్యార్థుల సత్కారం,సాంస్కృతిక కార్యక్రమాలు జరిగేలా ఎవరికీ ఏ చిన్న అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు జరగాలని ఆదేశించారు. ఉద్యోగులు,అధికారులు,వారి కుటుంబ సభ్యులు,స్థానికులు పెద్ద సంఖ్యలో ఇండిపెండెన్స్ డే సెలబ్రేషన్స్‌లో పాల్గొనాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం కృష్ణ ప్రసాద్, ఏజీఎం లు సుమలత,ఆనంద్ కుమార్, డీజీఎంలు అనిల్ కుమార్, రాజన్న, హరినారాయణ, కృష్ణారెడ్డి, ఐకె ఓసీ పీఓ ఏవీ రెడ్డి,ఆర్కే గ్రూప్ ఏజెంట్ శ్రీధర్,ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ జక్కారెడ్డి,డీవై పీఎం క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.